



నందనం వైఎంసీఏ గ్రౌండ్స్‌లో లారీలోని ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న చెన్నై జిల్లా రిటర్నింగ్ అధికారి డాక్టర్ జే రాధాకృష్ణన్ - పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న ఎన్నికల సిబ్బంది - రాయపురంలోని సెయింట్ థెరిస్సా బాలికల పాఠశాలలో ఏర్పాటైన పోలింగ్ కేంద్రం

నేడే పోలింగ్



సొంతూళ్లకు వెళ్లేవారితో కిటకిటలాడుతున్న రైల్వే స్టేషన్

39 లోక్‌సభ స్థానాలు- 950 మంది అభ్యర్థులు ● 6.23 కోట్ల మంది ఓటర్లు

● భారీ బందోబస్తు నడుమ పోలింగ్‌కు సర్వం సిద్ధం

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమరానికి సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలోని మొత్తం 39 లోక్‌సభ నియోజకవర్గాలకు ఒకే విడతలో ఎన్నిక నిర్వహించే క్షణాలు సమీపించాయి. దీని కోసం ఎన్నికల అధికారులు ఏర్పాట్లు సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. రాష్ట్రంలోని 6.23కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి, అన్నాడీఎంకే కూటమి, బీజేపీ కూటమితో పాటు బీఎస్పీ, నామ్ తమిళర్ కట్చి, స్వతంత్రులు కలిపి మొత్తం 950 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ ఎన్నికలకుగాను 1.58 లక్షల ఈవీఎంలు. 81.157 కంట్రోలింగ్ యూనిట్లు, 86,858 వీవీ పాట్ యంత్రాలను ఉపయోగించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 68,321 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 44.801 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ద్వారా నిఘా ఏర్పాటు చేశారు. దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణులు సులువుగా ఓటేసేందుకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేపట్టారు.

ఎన్నికల డ్యూటీలో 3.32 లక్షల మంది...

రాష్ట్ర వ్యాప్తంగా పోలింగ్ విధుల్లో 3.32 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. వీరికి మూడు విడతలుగా శిక్షణా కార్యక్రమాలు కూడా నిర్వహించారు. ఎన్నికల సిబ్బంది శుక్రవారం తప్పకుండా విధులకు హాజరుకావాలని ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. రాష్ట్ర మంతటా 8050 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకమైనవని గుర్తించారు. వీటిలో 181 పోలింగ్ కేంద్రాలు అతి సమస్యాత్మకమైనవని ప్రకటించి ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు, పారా మిలిటరీ, సాయుధ పోలీసులతో పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. ఈ పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరిగే తీరును సచివాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి ఎన్నికల సంఘం ప్రధానాధికారి సత్యప్రద సాహు ఎప్పటికప్పుడు పరిశీలించేలా వెబ్ కెమెరాలు, సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బంది, భద్రతా బలగాలు ఇప్పటికే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో వెళ్లారు.

దివ్యాంగులకు వాహన సదుపాయం...

శుక్రవారం ఓటు వేసేందుకు వెళ్లే దివ్యాంగులు, 85 యేళ్లకు పైబడిన వృద్ధులకు ఉచిత వాహన సదుపాయం కూడా కల్పిస్తున్నారు. 1950 అనే నెంబర్‌కు ఫోన్ చేస్తే ఇంటి దగ్గర నుండే వీరిని ప్రత్యేక వాహనంలో ఆయా పోలింగ్ కేంద్రాలకు తీసుకెళ్తారు. సిటీ బస్సులలో 85 యేళ్లకు పైబడిన వృద్ధులు ఓటరు గుర్తింపు కార్డు చూసి ఉచితంగా ప్రయాణించవచ్చునని అధికారులు తెలిపారు.



దివ్యాంగుల కోసం వీల్ ఛైర్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఇవీ విశేషాలు

- 6 కోట్లా 23 లక్షలా 33 వేలా 925 మంది ఓటర్లున్నారు. వీరిలో 3కోట్ల 6 లక్షలా 5 వేల 793 మంది పురుషులు, 3 కోట్లా 17లక్షలా 19 వేల 665 మంది మహిళలు. 8467 మది హిజ్రాలు.
- ఈ ఎన్నికలకు రాష్ట్రమంతటా 68,321 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు
- 850 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తింపు
- 181 పోలింగ్ కేంద్రాలు అతి సమస్యాత్మక కేంద్రాలు గుర్తింపు
- ఎన్నికల భద్రత కోసం పొరుగు రాష్ట్రాల నుండి 10 వేల మంది పోలీసుల తరలింపు
- ఈ ఎన్నికల్లో 950 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో 873 మంది పురుషులు, 77 మంది మహిళలు. వీరిలో 606 మంది స్వతంత్ర్య అభ్యర్థులు
- ఈ ఎన్నికల్లో 10లక్షల 92 వేల 420 మంది తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకోనున్నారు
- 20 నుంచి 29 యేళ్లలోపు వయస్సున్న ఓటర్ల సంఖ్య 1.10 కోట్లు
- 30 నుంచి 30 యేళ్లలోపు ఓటర్ల సంఖ్య 1.29కోట్లు
- 40 నుండి 49 యేళ్లలోపు ఓటర్ల సంఖ్య1.37 కోట్లు
- 50 నుంచి 59 యేళ్లలోపున్న ఓటర్ల సంఖ్య 1.10 కోట్లు
- 60 నుంచి 69 యేళ్లలోపున్న ఓటర్ల సంఖ్య 71.64 లక్షలు
- 70 నుంచి 79 యేళ్లలోపున్న ఓటర్ల సంఖ్య 38.66లక్షలు
- 80 యేళ్లకు పైబడిన వయస్సుగల ఓటర్ల సంఖ్య 14.44 లక్షలు

లోక్‌సభ నియోజకవర్గాలు	39
ఓటర్లు	6,23,33,925
అభ్యర్థులు	950
పోలింగ్ కేంద్రాలు	68,321
సమస్యాత్మక కేంద్రాలు	8050
అతి సమస్యాత్మక కేంద్రాలు	181

సమయం: ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు

భద్రతా సిబ్బంది : 3 లక్షలు



ఓట్టేరి కూక్స్‌రోడ్డులో యువ ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక పోలింగ్ కేంద్రం

2 లక్షల మంది పోలీసులతో భద్రతా ఏర్పాట్లు...

పోలింగ్ సందర్భంగా రాష్ట్రమంతటా సుమారు 2 లక్షల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వీరితోపాటు కేంద్రం నుండి రప్పించిన 190 కంపెనీల పారామిలిటరీ బలగాలు కూడా పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తిస్తారు. గురువారం సాయంత్రం నుంచే వీరంతా తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల వద్ద విధులు ప్రారంభించారు. ఎన్నికల భద్రతా విధులపై డీజీపీ శంకర్‌జివాల్ ఆయా జిల్లాల పోలీసు ఉన్నతాధికారులలో పలు విడతలుగా సమీక్షలు నిర్వహించారు. ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావులేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని ఎస్పీలకు ప్రత్యేకంగా ఆదేశాలిచ్చారు. నగరంలో ఎన్నికల భద్రతా ఏర్పాట్లను పోలీసు కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ పర్యవేక్షించారు. అదనపు పోలీసు కమిషనర్లు ప్రేమానంద్ సిన్హా, అస్రా కార్గ్ నాయకత్వంలో 20 వేల మంది పోలీసులు భద్రతా విధుల్లో పాల్గొంటున్నారు.



పోలీసులకు ఎన్నికల డ్యూటీ వేస్తున్న అధికారులు

6 గంటల తర్వాత టోకెన్లు...

పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సమయం ముగిసిన తర్వాత క్యూలైన్లలో నిలిచే ఓటర్లకు టోకెన్లు పంపిణీ చేసి ఓటు వేసేలా పోలింగ్ సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టనున్నారు. శుక్రవారం సాయంత్రం ఆరుగంటలకు పోలింగ్ ముగియనున్న విషయం తెలిసిందే. నగరంలోని మూడు లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలింగ్ ముగిసిన తర్వాత భారీ భద్రతా ఏర్పాట్ల నడుమ అన్నాయూనివర్సిటీ, క్వీన్‌మేరీస్ కళాశాల, లయోలా కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాలకు తరలించనున్నారు. ఈ మూడు కౌంటింగ్ కేంద్రాల్లో స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంలను 42 రోజులపాటు భద్రపరచనున్నారు. జూన్ 4వ తేదీన కౌంటింగ్ జరుగనుంది.

ఏరులై పారిన ధన ప్రవాహం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా డబ్బు ఏరులై పారింది. బుధవారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగియగానే వివిధ పార్టీల అభ్యర్థులు, వారి అనుయాయులు, అనుచరులు ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు యత్నించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఓటుకు రూ.500 నుంచి రూ.2,500 వరకు ఖరీదు కట్టి ప్రలోభాలకు గురి చేసినట్లు తెలుస్తోంది. దీనికి తోడు మద్యం, వివిధ రకాల బహుమతులు కూడా పలు మార్గాల్లో ఓటర్లకు చేరినట్లు ఆయా పార్టీల అభ్యర్థులే ఆరోపించుకోవడం గమనార్హం.

నిర్భయంగా ఓటేయండి

● ఎన్నికల ప్రధాన అధికారి సత్యప్రదసాహు



మీడియాతో సత్యప్రద సాహు

ప్యారీస్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని, అందువల్ల ఎలాంటి భయాందోళనలకు లోను కాకుండా ప్రజలంతా ఓటు హక్కు వినియోగించుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సత్యప్రద సాహు విజ్ఞప్తి చేశారు. సెయింట్ జార్జి కోట ప్రాంగణంలోని సచివాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... తమిళనాడులో శాంతిభద్రతలకు ఎటువంటి ఇబ్బంది లేని కారణంగా లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల్లో ఒకే విడతగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కన్నియాకుమారి జిల్లా విలవంగోడు అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లు మాత్రం శుక్రవారం లోక్‌సభ ఎన్నికలతో పాటు ఉప ఎన్నికలకు సంబంధించి రెండేసి ఓట్లు వినియోగించుకుంటారని తెలిపారు. ఓటర్ల సందేహాలు, అనుమానాల నివృత్తికి 1950 అనే టోల్ ఫ్రీ నెంబరు ఉపయోగించుకోవచ్చన్నారు. తొలిసారి ఓటర్లు తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ విలువైన ఓటుకు వెలకట్టరాదన్నారు. ఈ ఓటర్లు తమ స్నేహితులు, కుటుంబ సభ్యులకు చెప్పి ఓటు వేయించి తమ కర్తవ్యాన్ని నెరవేర్చాలన్నారు. రాష్ట్ర ప్రజలు ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటేసేందుకు అన్ని వసతులు సమకూర్చినట్లు తెలిపారు. 44,801 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కెమెరాలు పొందుపరచి పోలింగ్ ప్రక్రియ రికార్డు చేసే బాధ్యతలు అధికారులకు అప్పగించినట్లు ఆయన వెల్లడించారు.. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలని, సాయంత్రం 6 గంటలకు ముందే పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి ఓటు వేయని వారికి టోకెన్లు పంపిణీ చేయనున్నట్లు సత్యప్రద సాహు వివరించారు.

పోలింగ్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలి

● సీఎం స్టాలిన్ పిలుపు



అడయార్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో శుక్రవారం జరిగే లోక్‌సభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా తమ పార్టీకి చెందిన పోలింగ్ ఏజెంట్లు మరింత అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. ఇదే విషయంపై ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మొత్తం ఏడు దశల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల సమయంలో భాగంగా తొలి దశలో రాష్ట్రంలోని 39 లోక్‌సభ స్థానాలకు పోలింగ్ శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహించేలా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిందన్నారు. ఈ పోలింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో పార్టీ తరపున ఉండే ఏజెంట్లు అప్రమత్తంగా, మరింత జాగ్రత్తగా ఉండాలని కోరారు. పోలింగ్ సమయంలో నిబంధనలను తు.చ తప్పకుండా పాటించాలని సూచించారు. ఒక్క పోలింగ్ ఏజెంట్లు మాత్రమే కాకుండా, కూటమి పార్టీల నేతలు కూడా ఐక్యతగా ఉంటూ కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

స్థానికేతరులు ఖాళీ

● 1.48 లక్షల మందిని పంపించిన పోలీసులు

● హోటళ్లు, లాడ్జీల్లో ముమ్మరంగా తనిఖీలు

అడయార్, ఏప్రిల్ 18: గత కొన్ని రోజులుగా నగరంలో ఉంటూ ఎన్నికల ప్రచారం చేసిన స్థానికేతరుల్లో 1.48 లక్షల మంది బుధవారం నగరాన్ని వీడారు. నెల రోజుల పాటు అన్ని పార్టీల అభ్యర్థులకు మద్దతుగా వివిధ ప్రాంతాల నుంచి ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు నగరానికి వచ్చి వివిధ ప్రాంతాల్లో బసచేశారు. అయితే, పోలింగ్ రోజున స్థానికేతరులు ఉండకూడదనే ఎన్నికల సంఘం ఆదేశాలతో వారంతా తమతమ సొంతూర్లకు వెళ్ళిపోయారు. అలా బుధవారం ఒక్కరోజే ఏకంగా లక్షా 48 వేల 800 మంది నగరాన్ని ఖాళీ చేసి సొంతూర్లకు వెళ్ళిపోయారు. అలాగే, గురువారం మరింత ఎక్కువ మంది తమ ప్రాంతాలకు వెళ్ళి ఉంటారని రవాణా శాఖ అధికారులు తెలిపారు. ఇదే విషయంపై రవాణా శాఖ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ, లోక్‌సభ ఎన్నికల పోలింగ్ దృష్ట్యా నగరంలోని స్థానికేతరులు తమతమ సొంతూర్లకు వెళ్ళేందుకు వీలుగా 2092 బస్సులతో పాటు మరో 807 ప్రత్యేక బస్సులను కూడా నడిపినట్లు వెల్లడించారు. చెన్నై నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్ళేందుకు బుధవారం ఒక్కరోజే 46,503 మంది ముందస్తు రిజర్వేషన్ చేసుకున్నారని ఆయన వెల్లడించారు.



ఓ లాడ్జీలో తనిఖీ చేస్తున్న పోలీసులు

నగరంలోని లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీలు

నగర వ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసింది. ఇందులో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, అన్ని లాడ్జీలు, అనుమానాస్పద హోటళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల ప్రచారం కోసం విదేశాల నుంచి నగరానికి వచ్చి గత కొన్ని రోజులుగా ఉన్న స్థానికేతరులు తక్షణం నగరాన్ని ఖాళీ చేసి వెళ్ళిపోవాలని ఈసీ ఆదేశించింది. అయితే, ఈసీ ఆదేశాలు బేఖాతరు చేసి లాడ్జీలు, హోటళ్ళలో ఉన్న వారిని గుర్తించేందుకు పోలీసులు ట్రిప్లికేన్, ఎగ్మోర్, పెరియమేడు, కోయంబేడు తదితర ప్రాంతాల్లోని లాడ్జీలు, హోటళ్ళలో తనిఖీ చేశారు. నగరంలో ఉండే స్థానికేతరులందరినీ నగరం విడిచి వెళ్ళేలా పోలీసులు చర్యలు చేపట్టారు.



మహిళల కోసం ఏర్పాటైన పింక్ పోలింగ్ కేంద్రం

మహిళల కోసం పింక్ పోలింగ్ కేంద్రాలు



పెరంబూర్, ఏప్రిల్ 18: వందశాతం ఓటింగ్ జరిగేందుకు తగిన విధంగా చర్యలు చేపడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఓటర్లకు రకరకాల ఏర్పాట్లు చేపడుతోంది. ఇందులో భాగంగా నగరంలో మహిళలకు సౌలభ్యంగా ఉండేలా 'పింక్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో డీఎంకే అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, సాధారణ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే ఫైలుపై సంతకాలు చేసిన విషయం తెలిసిందే. అదే సమయంలో సాధారణ బస్సులను మహిళలు తెలుసుకొనేలా వాటిపై 'పింక్ రంగు వేశారు. ప్రస్తుతం పింక్ బస్సు కనిపించిన వెంటనే మహిళలు గుర్తించి, వాటిని వినియోగించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో చెన్నై జిల్లాలో మూడు లోక్‌సభ స్థానాలున్నాయి. అందుకోసం నగరంలో 3,726 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. వీటిలో 16 ప్రాంతాల్లో పింక్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, వృద్ధులకు ప్రత్యేక క్యూలైన్లు, వృద్ధులు కూర్చొనేందుకు కుర్చీలు, బాలింతలు పిల్లలకు పాలిచ్చేలా ప్రత్యేక గది, పిల్లలకు ఆడుకొనే ప్రాంతం తదితరాలతో ఏర్పాటు చేసిన ఈ పింక్ పోలింగ్ కేంద్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దీంతో ఆయా కేంద్రాల్లో మహిళల ఓటింగ్ శాతం పెరగడం ఖాయమని ఈసీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

సమాచార దర్శిని

13 నుంచి 'ప్రజ్ఞ వేసవి శిబిరం'

అడయార్, ఏప్రిల్ 18: జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (చెన్నై) ఆధ్వర్యంలో మే 13 నుంచి 'ప్రజ్ఞ వేసవి శిబిరం' జరుగనుంది. పరమాత్మ పంచ స్వరూపాల పేరుతో ఆహ్లాదకరమైన తరగతులతో మే 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు వారం రోజుల పాటు జరుగుతుందని ట్రస్ట్ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ తరగతులకు 5 నుంచి 12 యేళ్ళ వయసుగల చిన్నారులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు. ఈ కార్యక్రమం మైలాపూరులోని ఆంధ్ర మహిళా సభలో జరుగుతుందని, తమ పేర్లను 98845 26116 నంబరులో లేదా "www.jetchennai.org' అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని వారు పేర్కొన్నారు.

రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో అనాథలకు ఉచిత విద్య

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: స్థానిక మైలాపూర్‌లోని రామకృష్ణ మిషన్ అనాథ విద్యార్థులకు బస, బోజన సదుపాయంతో ఉచిత విద్య అందజేయనుంది. 119 ఏళ్లుగా నడుస్తున్న రామకృష్ణ మిషన్ మానవర్ ఇల్లం అనే విద్యా కేంద్రంలో తల్లి, తండ్రి, ఇద్దరు మృతిచెంది పేదరికంతో ఉన్న 5వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు 6వ తరగతి అడ్మిషన్లు జరుగనున్నాయి. అలాగే, టెన్త్ ఫెయిలైన, 50 శాతం మార్కులు పొందిన విద్యార్థులకు మెకానికల్, ఆటోమొబైల్, కంప్యూటర్ విభాగాల్లో మొదటి సంవత్సరం డిప్లొమో కోర్సుల్లో ప్రవేశం కల్పించనున్నారు. ప్లస్ టూ పాసైన విద్యార్థులు నేరుగా రెండవ సంవత్సరంలో చేరవచ్చు. ఆసక్తి ఉన్న విద్యార్థులు www.rkmshome.org.in/admissions అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇతర వివరాలకు 044-24990264 అనే నెంబరు సంప్రదించవచ్చు.

28న 'ప్రాచీన కావ్య సాహిత్యంలో ఆధునిక వైద్యం'పై ఉపన్యాసం

అడయార్, ఏప్రిల్ 18: స్థానిక టీనగర్‌లోని వేద విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక కార్యక్రమంలో భాగంగా 'ప్రాచీన కావ్య సాహిత్యంలో ఆధునిక వైద్యాంశాలు' అనే అంశంపై గుంటూరుకు చెందిన ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ ఏవీ దక్షిణామూర్తి ఉపన్యసించనున్నారు. టీనగర్‌లోని ఆంధ్రా క్లబ్ ప్రాంగణంలో ఉన్న కృష్ణా హాల్‌లో ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు ఈ ఉపన్యాస కార్యక్రమం ప్రారంభమవుతుంది. తరతరాల తెలుగు కవిత ఉపన్యాస ధారావాహిక కార్యక్రమంలో భాగంగా ఇది 148వ ప్రసంగమని వేద విజ్ఞాన వేదిక అధ్యక్షుడు జెకే రెడ్డి, కార్యదర్శి కందనూరు మధు సంయుక్తంగా విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సాహితీ ప్రియులందరూ ఆహ్వానితులేనని వారు పేర్కొన్నారు.

నేడు రాత్రి 11 గంటల వరకు మెట్రోరైళ్లు

పెరంబూర్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని శుక్రవారం ప్రభుత్వం సెలవు ప్రకటించింది. ఈ నేపథ్యంలో సెలవు దినమైనా మెట్రోరైళ్ల శనివారం టైం టేబుల్ ప్రకారం నడుస్తాయని సీఎంఆర్‌ఎల్ తెలిపింది. ఉదయం 8 నుంచి 11 గంటలు, సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు 6 నిమిషాలకు ఒక రైలు, ఉదయం 11 నుంచి సాయంత్రం 5 గంటలు, రాత్రి 8 నుంచి 11 గంటల వరకు 7 నిమిషాలకు ఒక రైలు నడుస్తాయని సీఎంఆర్‌ఎల్ తెలిపింది.

రేపు ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, ఏప్రిల్ 18: స్థానిక చేపాక్కంలోని క్రికెట్ మైదానంలో జరుగనున్న ఐపీఎల్ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలు ఈ నెల 20వ తేది ఉదయం 10.40 గంటలకు ప్రారంభమవుతుందని చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఐపీఎల్ పోటీల్లో భాగంగా 23వ తేది చేపాక్కం మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్-లక్నో సూపర్ జెయింట్స్ మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ పోటీకి సంబధించిన టిక్కెట్ల విక్రయాలు ఈ నెల 20వ తేది ఆన్‌లైన్‌లో ప్రారంభం కానున్నాయి. టిక్కెట్టు ధరలు రూ.1,700, రూ.2,500, రూ.3,500, రూ.4,000, రూ.6,000లుగా నిర్ణయించినట్లు ప్రకటనలో తెలిపారు.

జూన్ 9న మదురైలో ప్రపంచ హైక్యూ మహానాడు

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: 'తమిళ్ హైక్యూ' మూడవ ప్రపంచ మహానాడు జూన్ 9వ తేది మదురైలో జరుగనుంది. మదురై ప్రపంచ తమిళ సంఘం, తమిళ్ హైక్యూ, కవుల సంఘం, ఇనియ నందవనం పత్రిక సంయుక్తంగా రెండు సార్లు ఈ మహానాడు నిర్వహించాయి. ఈ ఏడాది మూడవ మహానాడు మదురైలో జరుగనుంది. సింగపూర్, మలేసియా, శ్రీలంక దేశాల నుంచి తమిళ రచయితలు హాజరుకానున్నారు. మహానాడులో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న వారు 9940781998 అనే నెంబరు సంప్రదించవచ్చు.

21 వరకు తరగతులు నిర్వహించరాదు

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని ఈ నెల 21వ తేది వరకు తరగతులు నిర్వహించరాదని పాఠశాలలకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. తమిళనాడు, పుదుచ్చేరిలో 40 నియోజకవర్గాల్లో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ శుక్రవారం జరుగనుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పోలింగ్ బూత్‌లుగా పనిచేస్తుండడంతో వాటిలో ఈ నెల 15వ తేది నుంచి ఎలాంటి తరగతులు నిర్వహించడం లేదు. పోలింగ్ కేంద్రాలు లేని ప్రైవేటు పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో, అలాంటి పాఠశాలలు కూడా 21వ తేది వరకు తరగతులు నిర్వహించరాదని ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కూడన్‌కుళంలో విద్యుదుత్పత్తి ప్రారంభం

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: కూడన్‌కుళం అణు విద్యుత్ కేంద్రంలో 77 రోజుల అనంతరం విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. తిరునల్వేలి జిల్లా కూడన్‌కుళంలోని కేంద్రప్రభుత్వ అణువిద్యుత్ కేంద్రంలో తలా 1,000 మెగావాట్ల సామర్థ్యంతో రెండు యూనిట్లలో ఉత్పత్తి జరుగుతోంది. అందులో రాష్ట్రానికి ప్రతిరోజు 1,152 మెగావాట్ల విద్యుత్ కేటాయిస్తున్నారు. మొదటి యూనిట్‌లో ఇంధనం నింపేందుకు జనవరి 29 నుంచి ఉత్పత్తి నిలిపివేశారు. ఈ నేపథ్యంలో, పనులు పూర్తికావడంతో 77 రోజుల అనంతరం మంగళవారం రాత్రి నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు.

ఎర్నాకుళం-పాట్నా ప్రత్యేక రైలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: కేరళ రాష్ట్రం ఎర్నాకుళం నుంచి తమిళనాడు మీదుగా బీహార్ రాష్ట్రం పాట్నాకు అన్‌రిజర్వ్‌డ్ ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఎర్నాకుళం నుంచి ఈ నెల 19,26, మే 3,10,17,24,31, జూన్ 7,14,21,28 తేదీల్లో రాత్రి 11 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు నాలుగవ రోజు వేకువజామున 3.30 గంటలకు పాట్నా చేరుకుంటుంది. పాట్నా నుంచి ఈనెల 22,29, మే 6,13,20,27, జూన్ 3,10,17,24, జూలై 1 తేదీల్లో రాత్రి 11.45 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు నాలుగో రోజు ఉదయం 10.30 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు కోయంబత్తూరు, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పేట, కాట్పాడి, అరక్కోణం, చెన్నై పెరంబూర్ మీదుగా నడువనున్నాయి.

బరిలో ఉన్న అభ్యర్థులు వీరే

పెరంబూర్, ఏప్రిల్ 18: రాష్ట్రంలోని 39 లోక్‌సభ నియోజకవర్గాల పోలింగ్ శుక్రవారం జరుగనుంది. 39 స్థానాలకు 1,509 మంది పురుషులు , 240 మంది మహిళలు మొత్తం 1,749 మంది నామినేషన్లు వేశారు. నామినేషన్ల పరిశీలనలో 679 తిరస్కరణకు గురికాగా, 120 మంది ఉపసంహరించుకున్నారు. దీంతో, ప్రస్తుత ఎన్నికల బరిలో 873 మంది పురుషులు, 77 మంది మహిళలు కలిపి మొత్తం 950 మంది నిలిచారు. ఈ సారి ఎన్నికల్లో కరూర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి అత్యధికంగా 54 మంది, అత్యల్పంగా దిండుగల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 8 మంది బరిలో ఉన్నారు. లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోటీచేస్తున్న ప్రధాన పార్టీలు, కూటమి పార్టీల తరఫున పోటీచేస్తున్న అభ్యర్థుల వివరాలిలా ఉన్నాయి...

నెం	నియోజకవర్గం	డీఎంకే కూటమి	అన్నాడీఎంకే కూటమి	బీజేపీ కూటమి	మొత్తం అభ్యర్థులు
1	తిరువళ్లూర్(ఎస్సీ)	శక్తినాథ్ సెంథిల్ (కాంగ్రెస్)	నల్లతంబి (డీఎండీకే)	వి.పొన్ బాలగణపతి (బీజేపీ)	14 మంది
2	ఉత్తర చెన్నై	డా.కళానిధి వీరాస్వామి (డీఎంకే)	ఆర్.మనోహర్ (అన్నాడీఎంకే)	ఆర్సీ పాల్ కనకరాజ్ (బీజేపీ)	35 మంది
3	దక్షిణ చెన్నై	టి.సుమతి (అలియాస్) తమిళచ్చి తంగపాండ్యన్ (డీఎంకే)	డా.జె.జయవర్ధన్ (అన్నాడీఎంకే)	డా.తమిళిసై సౌందర్‌రాజన్ (బీజేపీ)	41 మంది
4	మధ్య చెన్నై	దయానిధి మారన్ (డీఎంకే)	పార్థసారథి (డీఎండీకే)	వినోజ్ పి.సెల్వం (బీజేపీ)	31 మంది
5	శ్రీపెరుంబుదూర్	టీఆర్ బాలు (డీఎంకే)	జి.ప్రేమ్‌కుమార్ (అన్నాడీఎంకే)	వీఎన్ వేణుగోపాల్ (టీఎంసీ)	31 మంది
6	కాంచీపురం (ఎస్సీ)	జి.సెల్వం (డీఎంకే)	ఇ.రాజశేఖర్ (అన్నాడీఎంకే)	వి.జ్యోతి (పీఎంకే)	11 మంది
7	అరక్కోణం	ఎస్.జగద్రక్షకన్ (డీఎంకే)	ఎల్.విజయన్ (అన్నాడీఎంకే)	కె.బాలు (పీఎంకే)	26 మంది
8	వేలూరు	డీఎం కదిర్ ఆనంద్ (డీఎంకే)	డా.ఎస్.పసుపతి (అన్నాడీఎంకే)	ఏసీ షణ్ముగం (బీజేపీ)	31 మంది
9	కృష్ణగిరి	గోపినాథ్ (కాంగ్రెస్)	వి.జయప్రకాష్ (అన్నాడీఎంకే)	సి.నరసింహన్ (బీజేపీ)	27 మంది
10	ధర్మపురి	ఎ.మణి (డీఎంకే)	డా.ఆర్.అశోకన్ (అన్నాడీఎంకే)	సౌమ్య అన్బుమణి (పీఎంకే)	24 మంది
11	తిరువణ్ణామలై	సీఎన్ అన్నాదురై (డీఎంకే)	ఎం.కలియపెరుమాళ్	ఎ.అశ్వత్థామన్ (బీజేపీ)	31 మంది
12	ఆరణి	ఎంఎస్ ధరణివేందన్ (డీఎంకే)	జీవీ గజేంద్రన్ (అన్నాడీఎంకే)	డా.గణేష్‌కుమార్ (పీఎంకే)	29 మంది
13	విల్లుపురం (ఎస్సీ)	డి.రవికుమార్ (డీపీఐ)	జె.భాగ్యరాజ్ (అన్నాడీఎంకే)	ఎస్.మురళిశంకర్ (పీఎంకే)	17 మంది
14	కళ్లకుర్చి	డి.మలైఅరసన్ (డీఎంకే)	ఆర్.కుమరగురు (అన్నాడీఎంకే)	దేవదాస్ రామస్వామి (పీఎంకే)	21 మంది
15	సేలం	టీఎం సెల్వగణపతి (డీఎంకే)	పి.విఘ్నేష్ (అన్నాడీఎంకే)	ఎన్.అన్నాదురై (పీఎంకే)	25 మంది
16	నామక్కల్	వీఎస్ ముత్తేశ్వరన్ (డీఎంకే)	ఎస్.తమిళ్‌మణి (అన్నాడీఎంకే)	డా.కేపీ రామలింగం (బీజేపీ)	31 మంది
17:	ఈరోడ్	కేఈ ప్రకాష్ (డీఎంకే)	అశోక్‌కుమార్ (అన్నాడీఎంకే)	పి.విజయకుమార్ (టీఎంసీ)	31 మంది
18	తిరుప్పూర్	కె.సుబ్బరాయన్ (సీపీఐ)	పి.అరుణాచలం (అన్నాడీఎంకే)	ఏపీ మురుగానందం(బీజేపీ)	13 మంది
19	నీలగిరి (ఎస్సీ)	ఎ.రాజా (డీఎంకే)	లోకేష్ తమిళ్‌సెల్వన్ (అన్నాడీఎంకే)	ఎల్.మురుగన్ (బీజేపీ)	16 మంది
20:	కోయంబత్తూర్	పి.గణపతి రాజ్‌కుమార్ (డీఎంకే)	సింగై జి.రామచంద్రన్ (అన్నాడీఎంకే)	అన్నామలై (బీజేపీ)	37 మంది
21:	పొల్లాచ్చి	కె.ఈశ్వరస్వామి (డీఎంకే)	ఎ.కార్తికేయన్ (అన్నాడీఎంకే)	కె.వసంతరాజన్ (బీజేపీ)	15 మంది
22:	దిండుగల్	ఆర్.సచ్చిదానందం (సీపీఎం)	ఎంఏ మహమ్మద్ ముబారక్(అన్నాడీఎంకే)	ఎం.తిలకభామ (పీఎంకే)	8 మంది
23:	కరూర్	ఎస్.జ్యోతిమణి (కాంగ్రెస్)	ఎల్.తంగవేల్ (అన్నాడీఎంకే)	వీవీ సెంథిల్‌నాథన్ (బీజేపీ)	54 మంది
24:	తిరుచ్చి	దురై వైగో (ఎండీఎంకే)	పి.కరుప్పయ్య (అన్నాడీఎంకే)	పి.సెంథిల్‌నాథన్ (ఏఎంఎంకే)	36 మంది
25:	పెరంబలూరు	అరుణ్ నెహ్రూ (డీఎంకే)	ఎన్డీ చంద్రమోహన్ (అన్నాడీఎంకే)	టీఆర్ పారివేందర్ (బీజేపీ)	23 మంది
26:	కడలూరు	ఎంకే విష్ణు ప్రసాద్ (కాంగ్రెస్)	పి.శివకొళుందు (డీఎండీకే)	తంగర్ బచ్చన్ (పీఎంకే)	19 మంది
27:	చిదంబరం (ఎస్సీ)	తిరుమావళవన్ (డీపీఐ)	ఎం.చంద్రహాసన్ (అన్నాడీఎంకే)	పి.కార్తియాయిని (బీజేపీ)	14 మంది
28:	మైలాడుదురై	ఆర్.సుధ (కాంగ్రెస్)	పి.బాబు (అన్నాడీఎంకే)	ఎంకే స్టాలిన్ (పీఎంకే)	17 మంది
29:	నాగపట్టణం (ఎస్సీ)	వి.సెల్వరాజ్ (సీపీఐ)	డా.జి.సుర్జిత్ శంకర్ (అన్నాడీఎంకే)	ఎస్జీఎం రమేష్ గోవింద్	9 మంది
30:	తంజావూరు	ఎస్.మురసోలి (డీఎంకే)	పి.శివనేశన్ (అన్నాడీఎంకే)	ఎం.మురుగానందం (బీజేపీ)	12 మంది
31:	శివగంగ	కార్తీ పి.చిదంబరం (కాంగ్రెస్)	ఎ.జేవియర్ దాస్ (అన్నాడీఎంకే)	టి.దేవనాథన్ యాదవ్ (బీజేపీ)	20 మంది
32:	మదురై	ఎస్.వెంకటేశన్ (సీపీఎం)	పి.శరవణన్ (అన్నాడీఎంకే)	రామశ్రీనివాసన్ (బీజేపీ)	21 మంది
33:	తేని	తంగ తమిళ్‌సెల్వన్ (డీఎంకే)	వీటీ నారాయణస్వామి (అన్నాడీఎంకే)	టీటీవీ దినకరన్ (ఏఎంఎంకే)	25 మంది
34:	విరుదునగర్	బి.మాణిక్యం ఠాగూర్ (కాంగ్రెస్)	వి.విజయ ప్రభాకరన్ (డీఎండీకే)	ఆర్.రాధిక (బీజేపీ)	27 మంది
35:	రామనాథపురం	కె.నవాజ్ ఘనీ (ఐయూఎంఎల్)	పి.జయపెరుమాళ్ (అన్నాడీఎంకే)	ఒ.పన్నీర్‌సెల్వం (ఇండిపెండెంట్)	25 మంది
36:	తూత్తుకుడి	కనిమొళి (డీఎంకే)	ఆర్.శివస్వామి వేలుమణి (అన్నాడీఎంకే)	ఎస్డీఆర్ విజయశీలన్ (టీఎంసీ)	28 మంది
37:	తెన్‌కాశి (ఎస్సీ)	డా.రాణి శ్రీకుమార్ (డీఎంకే)	డా.కె.కృష్ణస్వామి (అన్నాడీఎంకే)	బి.జాన్ పాండ్యన్ (బీజేపీ)	15 మంది
38:	తిరునల్వేలి	సి.రాబర్ట్ బ్రూస్ (కాంగ్రెస్)	ఎం.ఋస్సిరాణి (అన్నాడీఎంకే)	నయినార్ నాగేంద్రన్ (బీజేపీ)	23 మంది
39:	కన్నియాకుమారి	విజయకుమార్ (అలియాస్) విజయ్ వసంత్ (కాంగ్రెస్)	పెసిలియన్ నజరేత్ (అన్నాడీఎంకే)	పొన్.రాధాకృష్ణన్(బీజేపీ)	22 మంది

కన్నదాసన్ నగర్‌లో వైభవంగా రాములోరి కల్యాణం



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామివార్లు

ప్యారీస్, ఏప్రిల్ 18: స్థానిక కొడుంగైయూర్ సమీపంలోని కన్నదాసన్ నగర్‌లో రాములోరి కల్యాణోత్సవం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. తిరువళ్లువర్ నగర్ మూడవ ప్రధాన వీధిలో ఉన్న విష్ణుశక్తి వినాయక దేవస్థానం (పెరుమాళ్ ఆలయం) ప్రధాన అర్చకులు ఎస్.భాస్కర పంతులు బృందం కన్నదాసన్ నగర్ 60 అడుగుల రోడ్డులోని ప్రముఖ కాళికాంబ ఆలయ కూడలిలో ఏర్పాటుచేసిన సూర్యవంశం పెళ్లి పందిరిలో అశేష భక్తజనం సమక్షంలో సీతారాముల కల్యాణఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కన్నదాసన్ నగర్, కొడుంగైయూర్, తిరువళ్లువర్ నగర్, సంజయ్‌గాంధీ వీధి, సిడ్కో నగర్ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు వారితో ఏర్పాటైన సీతారామ కల్యాణ సేవా సమితి సీతారాముల కల్యాణాన్ని పుణ్యక్షేత్రం భద్రాచలంలో మాదిరిగానే నిర్వహిస్తూ తెలుగు సంస్కృతికి అద్దం పడుతున్నారు. వధూవరులను అలంకరించిన అనంతరం ఆలయం నుంచి మంగళవాయిద్యాలతో ఊరేగింపుగా వేదిక ప్రాంగణానికి తరలించారు. ప్రత్యేక పూజల అనంతరం ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి కల్యాణానికి సిద్ధం చేశారు. రాత్రి 8 నుంచి కోదండరాముడి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ట్రస్ట్ ఉప కార్యదర్శి మొలగనూరు విజయకుమార్-సురేఖ దంపతులు కన్యాదానం చేసి పెండ్లి క్రతువును పర్యవేక్షించి భక్తులందరికి తీర్థ అన్నప్రసాదాలను ట్రస్ట్ తరఫున పంపిణి చేశారు.

ఏనుగుల పర్యవేక్షణకు కంట్రోల్ రూమ్

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: కోయంబత్తూర్-మధుకరై పరిధిలో రైలు ప్రమాదాల్లో ఏనుగులు మృతిచెందకుండా అడ్డుకొనేలా ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. రైలు మార్గంలో ఏనుగుల సంచారాన్ని పర్యవేక్షించేందుకు సీసీ కెమెరాలు ఏర్పాటుచేశారు. వీటితో పాటు థర్మల్ కెమెరాలను ఏర్పాటుచేసి ఏనుగుల వివరాలు సేకరిస్తున్నారు. ఆ సమాచారాన్ని రైలు డ్రైవర్లకు తెలియజేసేలా ప్రస్తుతం ఏర్పాట్లు జరుగుతున్నాయి. కోవై-మధుకరైలో రెండు మార్గాల్లో ఈ కంట్రోల్ రూమ్ ద్వారా ఏనుగుల మరణాలను అడ్డుకోగలుగుతున్నామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.

ఎస్కేపీడీలో ఘనంగా శ్రీరామ నవమి ఉత్సవాలు



వెండి సూర్యప్రభ వాహనంపై స్వామివారి అభయం

ప్యారీస్, ఏప్రిల్ 18: స్థానిక జార్జిటౌన్ ఆదియప్ప నాయకన్ వీధిలోని కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్కేపీడీ)లో శ్రీరామ నవమిని పురస్కరించుకొని బుధవారం నుంచి ఈ నెల 28వ తేది వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. రెండో రోజైన గురువారం సాయంత్రం శ్రీ రామ చంద్రమూర్తిని వెండి సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ షావుకారుపేట చెన్నై ఆధ్వర్యంలో వేదపారాయణం, భక్తిగీతాలాపన అలరించింది.

పంట రుణాలకు ఒకే రకమైన నిబంధనలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: అన్ని సహకార బ్యాంకులు, సహకార సంఘాల్లో పంట రుణాలు ఇచ్చేందుకు ఒకే రకమైన నిబంధనలు ఆ శాఖ జారీచేసింది. రైతులకు సహకార బ్యాంకులు, సంఘాలు తక్కువ వడ్డీకి పంట రుణాలు అందజేయడంతో పాటు నిర్ణీత కాలంలో తిరిగి చెల్లించే వారి వడ్డీ మాఫీ చేస్తున్నాయి. కొన్ని సంఘాల్లో రుణాల పంపిణీలో వేర్వురుగా ఉన్నాయి. ప్రస్తుతం ఒకే రకమైన నిబంధనలు, మార్గదర్శకాలను సూచిస్తూ సహకార శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

21న మాంసం దుకాణాల మూసివేత

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: నగరంలో మహావీర్ జయంతిని పురస్కరించుకొని మాంసం దుకాణాలు మూసివేయాలని కార్పొరేషన్ ఉత్తర్వులు జారీచేసింది. చెన్నై జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పనిచేసే నాలుగు కబేళాలతో పాటు మాంసం దుకాణాలు మూసివేయాలని, నిబంధనలు ఉల్లంఘించే వ్యాపారులపై చర్యలు చేపట్టనున్నట్లు హెచ్చరికలు జారీచేసింది.

రూ.3.31 లక్షల టేకు చెట్లకు రూ. లక్ష జీఎస్టీ...!

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీల్లో పట్టుబడిన రూ.3.31 లక్షల విలువైన టేకు దుంగలకు రూ. లక్ష జీఎస్టీ వసూలుచేశారు. మైలాడుదురై లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో తరంగంబాడి సమీపంలో మంగళవారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనతనిఖీలు నిర్వహించారు. సెంగోట నుంచి మదురై టింబర్ సంస్థకు చెందిన లారీలో కారైక్కాల్ మీదుగా తరంగంబాడికి టేకు దుంగలు తరలించడాన్ని అధికారులు గుర్తించారు. 19 టన్నుల దుంగలను జీఎస్టీ చెల్లించకుండా తీసుకెళ్తున్నారని గుర్తించిన అధికారులు, వాటిని స్వాధీనం చేసుకొని అటవీ శాఖ కార్యాలయంలో అప్పగించారు. రూ.3.31 లక్షల విలువైన ఆ దుంగలకు రూ.1,01,086 జరిమానా వసూలుచేశారు. ఈ విషయమై అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ.. నిబంధనల మేరకే జీఎస్టీ విధించామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో 3.23 లక్షల మంది చేరిక

పెరంబూర్, ఏప్రిల్ 18: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 3.23 లక్షల మంది విద్యార్థులు చేరారు. వచ్చే విద్యా సంవత్సరం (2024-25) ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు మార్చి 1వ తేది నుంచి ప్రారంభమయ్యాయి. అడ్మిషన్లకు సంబంధించి పాఠశాల విద్య డైరెక్టరేట్ జిల్లా ప్రధాన విద్యాధికారులకు సర్క్యులర్ జారీచేసింది. అలాగే, ఆరోగ్యశాఖ ద్వారా 2018 నుంచి రాష్ట్రంలో జన్మించిన పిల్లల వివరాలను 'ఎమిస్' వెబ్‌సైట్ ద్వారా ఆయా జిల్లాలకు పంపించారు. ఆ ప్రకారం, 20 రోజుల్లో సుమారు 3.5 లక్షల మంది తల్లిదండ్రులను హెచ్‌ఎంలు కలిసి వారి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అలాగే, పాఠశాల విద్యా హెల్ప్ లైన్ నెంబరు (14417) నుంచి సుమారు లక్ష మంది తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆ ప్రకారం, ఇప్పటివరకు రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 3.23 లక్షల మంది చేరారని, ఈ సంఖ్య 4 లక్షలు దాటే అవకాశముందని అధికారులు తెలిపారు.

పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య

వేలూరు, ఏప్రిల్ 18: గుడియాత్తం సమీపంలోని ఓ గ్రామానికి చెందిన ఓ బాలిక (13) గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న గుడియాత్తం పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి, విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలను విచారిస్తున్నారు.

నీటమునిగి అన్నాతమ్ముళ్ల మృతి

పెరంబూర్, ఏప్రిల్ 18: వేసవి సెలవుల కోసం బామ్మ ఇంటికి వచ్చిన అన్నాతమ్ముళ్లు మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. కడలూరులోని మనవలర్చి పాఠశాల హాస్టల్ ఉంటూ చదువుకుంటున్న దిలీప్‌రాజ్, తమ్ముడు దినేష్ వేసవి సెలవులు కావడంతో రెండు రోజుల క్రితం నందీశ్వరమంగళంలోని బామ్మ ఇంటికి వచ్చారు. వారు బుధవారం సాయంత్రం సమీపంలోని చెరువులో స్నానానికి వెళ్లారు. లోతైన ప్రాంతానికి వెళ్లిన ఇద్దరు నీటమునిగారు. చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకొని చెరువులో గాలించి ఇరువురి మృతదేహాలు వెలికితీశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

అడవి జంతువులు వేటాడుతున్న వ్యక్తి అరెస్ట్

వేలూరు, ఏప్రిల్ 18: అడవి జంతువులను వేటాడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గుడియాత్తం సమీపం పాక్కం గ్రామంలో అడవి పంది మాంసం విక్రయిస్తున్నట్లు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందింది. దీంతో గుడియాత్తం అటవీ అధికారులు వినోభా, మాసిలామణి, పోలీసులు భూపతి, తిరునావుక్కరసు ఆ ప్రాంతంలో తనఖీ చేపట్టారు. అడవి పందిని చంపి మాంసం విక్రయిస్తున్న గాంధీకన్వాయ్ ప్రాంతానికి చెందిన శ్రీనివాసన్‌ను అరెస్ట్ చేసి, అతని నుంచి 6 కిలోల మాంసం స్వాధీనం చేసుకున్నారు.

పుదుచ్చేరిలో రూ.4.09 కోట్లు స్వాధీనం

పుదుచ్చేరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలోని బుధవారం ఉదయం రెండిళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రూ.4.09 కోట్లు స్వాధీనం చేసుకుని గురువారం ఉదయం ఐటీ అధికారులకు అప్పగించారు. ఎన్నికల నిర్వహణ అధికారి కులోత్తుంగన్ గురువారం మీడియాతో మాట్లాడుతూ... ఓటర్లకు నగదు పంపిణీని అడ్డుకొనేందుకు పుదుచ్చేరి రాష్ట్రంలో 72 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నియమించినట్లు తెలిపారు. రాష్ట్ర సరిహద్దులు, ప్రధాన చెక్‌పోస్ట్‌ల వద్ద తనిఖీలు కొనసాగుతున్నాయని, బీజేపీ తరఫున రూ.500, కాంగ్రెస్ తరఫున రూ.200 చొప్పున ఓటర్లకు పంపిణీ చేస్తున్నట్లు అన్నాడీఎంకే అభ్యర్థి ఫిర్యాదు చేశారని, బుధవారం రాత్రి రూ.64 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని, గురువారం ఉదయం రూ.1,39,13,860 స్వాధీనం చేసుకున్నామని, అంతేకాకుండా రూ.8,11,154 విలువ గల బహుమతులు స్వాధీనం చేసుకొని ఐదుగురిని అరెస్ట్ చేసి కులోత్తుంగన్ తెలిపారు.

అన్నామలై గెలుపు కోసం...!

● చేతివేలు కోసుకున్న కార్యకర్త



ఆస్పత్రిలో దురై రామలింగం

ప్యారీస్, ఏప్రిల్ 18: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కోయంబత్తూరు లోక్‌సభ నియోజకవర్గంలో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కడలూరు జిల్లా ముల్లిపల్లం ప్రాంతానికి చెందిన దురై రామలింగం అనే బీజేపీ కార్యకర్త తన ఎడమ చేతి చూపుడు వేలును కత్తితో కోసుకున్నాడు. ఆయన అన్నామలైకు మద్దతుగా రెండు వారాలుగా కోవైలో మకాం వేసి ప్రచారంలో పాల్గొంటున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు ప్రచారం ముగిసిన అనంతరం ఆ ప్రాంతంలో ఉన్న అమ్మవారి ఆలయం ముందు నిలబడి అన్నామలై గెలవాలని ప్రార్థనలు చేస్తూ తన వేలును కత్తితో నరుక్కున్నాడు. ఇది చూసి దిగ్భ్రాంతికి గురైన పార్టీ నిర్వాహకులు అతడిని అవివాశి రోడ్డులో ఉన్న ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యుల బృందం దురై రామలింగంకు శస్త్రచికిత్స ద్వారా తెగిన వేలును అతికించారు.

విజయకాంత్ కుమారుడిపై కేసు నమోదు

పెరంబూర్, ఏప్రిల్ 18: దివంగత డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్ చిన్న కుమారుడిపై పోలీసులు కేసు నమోదుచేశారు. విరుదునగర్ లోక్‌సభ నియోజకవర్గంలో బీజేపీ కూటమిలో డీఎండీకే అభ్యర్థిగా విజయకాంత్ పెద్ద కుమారుడు విజయ ప్రభాకరన్ పోటీచేస్తున్నాడు. ఆయనకు మద్దతుగా ఆయన తమ్ముడు, సినీ నటుడు షణ్ముగపాండ్యన్ బుధవారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ప్రచారంలో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ షణ్ముగపాండ్యన్ సహా అన్నాడీఎంకే, డీఎండీకే నిర్వాహకులు మొత్తం 14 మందిపై పోలీసులు కేసు నమోదుచేశారు.

బూత్ ఏజెంట్లకు బిర్యానీ, చికెన్ ఫ్రై

ఐసిఎఫ్, ఏప్రిల్ 18: డీఎంకే, అన్నాడీఎంకే అభ్యర్థులు బూత్ ఏజెంట్లకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం బిర్యానీ, చికెన్ ఫ్రై అందజేయనున్నారు. పోలింగ్ బూత్‌ల్లో అధికారులతో పాటు పోటీచేసే అభ్యర్థుల తరఫున బూత్ ఏజెంట్లను ఉండేందుకు ఈసీ అనుమతించింది. ఉదయం ప్రారంభమైనప్పటి నుంచి ఈవీఎంలను వాహనంలో ఎక్కించి లెక్కింపు కేంద్రాలకు తరలించే వరకు ఏజెంట్లు అక్కడే ఉండాల్సి ఉంటుంది. వారి కోసం వెజ్, నాన్ వెజ్ రెండు రకాలుగా అందజేయనున్నారు. ఉదయం టిఫిన్‌గా ఇడ్లీ, పొంగల్, పూరి, వడ, కేసరి, మధ్యాహ్నం మటన్ బిర్యానీ, చికన్ 65, సాయంత్రం సుండల్, దోశ, రెండు చపాతీ, కుర్మా, సాంబార్ అందజేయనున్నారు. బీజేపీ అభ్యర్థులు ఏజెంట్లకు ఆహారం అందజేసేందుకు హోటళ్లలో ఆర్డర్లు ఇచ్చారు.

గ్రేటర్‌లో 97,700 ఎన్నికల ప్రకటనల తొలగింపు

ప్యారీస్, ఏప్రిల్ 18: గ్రేటర్ చెన్నైలో 97,700 ఎన్నికల ప్రకటనలు తొలగించినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల నియామళిని పాటిస్తూ నగరంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి మార్చి 15 నుంచి నగరంలోని 200 వార్డుల్లో ప్రభుత్వ, ప్రైవేటు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన 17,798 అనుమతి లేని ప్రకటనలు తొలగించారు. అంతేకాకుండా ఎన్నికల కోడ్ ఉల్లంఘించినందుకు ఈ నెల 17వ తేది వరకు 43 కేసులు నమోదుకాగా, వాటిలో నిబంధనలు అధికంగా అతిక్రమించిన 25 కేసులపై విచారణ జరుపుతున్నట్లు అధికారులు తెలిపారు.

విమాన ఛార్జీలకు రెక్కలు

పెరంబూర్, ఏప్రిల్ 18: నగరం నుంచి పొరుగు జిల్లాలకు వెళ్లే విమాన ఛార్జీలు ధరలు పలు రెట్లు పెరిగాయి. రాష్ట్రంలోని 30 లోక్‌సభ నియోజకవర్గాలకు నేడు పోలింగ్ జరుగనున్న విషయం తెలిసిందే. రాష్ట్రప్రభుత్వ పోలింగ్ రోజైన శుక్రవారం ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించింది. దీంతో, శుక్ర, శని, ఆదివారాలు వరుసగా మూడు రోజులు సెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో, నగరం నుంచి ప్రజలు బస్సులు, రైళ్ల, విమానాల ద్వారా ఓటు వేసేందుకు స్వగ్రామాలకు బయల్దేరి వెళ్లారు. ఇందుకోసం ప్రత్యేక బస్సులు, రైళ్లు నడిపాయి. ఈ క్రమంలో, మదురై, తూత్తుకుడి తదితర దక్షిణ జిల్లాలు కోయంబత్తూర్ వెళ్లే విమాన ఛార్జీలు ఒక్కసారిగా పెరిగాయి. సాధారణంగా కోయంబత్తూర్‌కు రూ.3,500 ఛార్జీ ఉండగా, ప్రస్తుతం రూ.17,000కు పెరిగింది. అలాగే, మదురై, తూత్తుకుడి తదితర డెల్టా జిల్లాలకు విమాన ఛార్జీగా రూ.12,000 వరకు వసూలుచేస్తున్నారు. తిరుచ్చికి రూ.2,500 ఛార్జీ ఉండగా ప్రస్తుతం రూ.8,500, సేలంకు రూ.5,000 వసూలుచేస్తున్నారు. దీంతో, విమాన ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అలాగే, ప్రజల రద్దీని గమనించిన ఆమ్నీ బస్సులు కూడా ఛార్జీలు అమాంతం పెంచేశాయి.

కమిషనర్‌ను బదిలీ చేయాలంటూ రవాణా కార్మికుల ధర్నా

ప్యారీస్, ఏప్రిల్ 18: స్థానిక గిండిలో ఉన్న ఆర్టీఏ కార్యాలయ కమిషనర్‌ను బదిలీ చేయాలంటూ రవాణా కార్మికులు నల్లచొక్కాలు ధరించి ధర్నాకు దిగారు. తమిళనాడు ప్రభుత్వ రవాణా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో గిండిలోని ఆర్టీఏ కమిషనర్ కార్యాలయం ముందు గురువారం ఉదయం సుమారు 200 మందికి పైగా ఆందోళన చేపట్టారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కల్పించిన పదవులను, హక్కులను కాలరాసే విధంగా ఆర్టీఏ కమిషనర్ వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ పెద్ద ఎత్తున ఆయన వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ రవాణా సంస్థలో టెక్నికల్ రహిత ఉద్యోగులు 75 శాతం మంది, టెక్నికల్ ఉద్యోగులు 25 శాతం మంది విధుల్లో పాల్గొంటున్నారని, వీరి సమస్యల పరిష్కారానికి కమిషనర్ ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని ఆరోపించారు. తమ డిమాండ్లను ఎన్నికల తరవాఅత పరిష్కరింపజేయకుంటే ఈ నెల 24వ తేది విధులు బహిష్కరించి నిరసన తెలుపుతామని, రెండో విడతగా 30వ తేది నుంచి నిరధిక సమ్మెలో పాల్గొంటామని రవాణా ఉద్యోగులు తెలిపారు.

ఈపీఎస్‌పై దయానిధి మారన్ పరువునష్టం దావా

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ సీఎం ఎడప్పాడి పళనిస్వామిపై డీఎంకే ఎంపీ దయానిధి మారన్ పరువునష్టం దావా వేశారు. గురువారం ఉదయం ఎగ్మూరు కోర్టులో పిటిషన్ వేసిన అనంతరం దయానిధి మారన్ మీడియాతో మాట్లాడుతూ ఎంపీ నిధుల్లో 75 శాతం దుర్వినియోగపరిచనట్లు ఈపీఎస్ తనపె తప్పుడు ఆరోపణలు చేశారని, ఈ ఆరోపణలకు 24 గంటల్లోగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసినా ఆయన పట్టించుకోలేదన్నారు. దీంతో ఎగ్మూరు కోర్టులో పిటిషన్ వేసినట్లు తెలిపారు. ఈ పిటిషన్ మే 14న విచారణకు వస్తుందన్నారు.

మలేసియా నుంచి నకిలీ పాస్‌పోర్ట్‌తో వచ్చిన ఇద్దరి అరెస్టు

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మలేసియా రాజధాని కౌలాలంపూర్ నుంచి నకిలీ పాస్‌పోర్ట్‌తో వచ్చిన ఓ యువతి, యువకుడిని కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకుని మీనాంబాక్కం విమానాశ్రయ పోలీసులకు అప్పగించారు. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో కౌలాలంపూర్ నుండి వచ్చిన విమాన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు.. ఆ సమయంలో కోల్‌కతా చిరునామా కలిగిన నకిలీ పాస్‌పోర్ట్‌తో వచ్చిన రాజవర్మన్ (31), సుభద్ర (26) అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. అధికారుల విచారణలో వారిద్దరూ బంగ్లాదేశ్‌కు చెందినవారిగా గుర్తించారు. విమానాశ్రయ పోలీసులు ఇరువురిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు.

దుబాయ్, షార్జాలకు 12 విమాన సర్వీసుల రద్దు...

దుబాయ్, కువైట్, షార్జా దేశాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో చెన్నై నుంచి ఆ మూడు దేశాలకు వెళ్ళాల్సిన, అదే విధంగా ఆ మూడు దేశాల నుండి నగరానికి రావల్సిన 12 విమాన సర్వీసులను రద్దు చేసినట్లు విమానాశ్రయ ఉన్నతాధికారులు ప్రకటించారు. బుధవారం 10 విమాన సర్వీసులను రద్దు చేశామని, ఆ మూడు దేశాల్లో వాతావరణం అనుకూలించని కారణంగా తాజాగా 12 విమాన సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

60 లీటర్ల సారాయి స్వాధీనం

వేలూరు, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల కారణంగా మూడు రోజులు టాస్మాక్ దుకాణాలకు సెలవు ప్రకటించారు. ఈ క్రమంలో, అక్రమంగా మద్యం విక్రయించే వారిపై చర్యలు చేపట్టాలని ఎస్పీ మణివన్నన్ ఆదేశించారు. ఆ ప్రకారం, వేపంకుప్పం సీఐ నాగరాజన్ నేతృత్వంలో పోలీసులు తామరైగుట్ట ప్రాంతంలో తనిఖీలు చేసి అక్కడ దాచిన 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని జయశంకర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు.



వేలూరు జిల్లా కేవీ కుప్పం బీడీవో కార్యాలయంలో ఎన్నికల సామగ్రి తరలింపును పర్యవేక్షిస్తున్న ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి

ఓటు వేసేందుకు...!

అమెరికా నుంచి స్వగ్రామానికి వచ్చిన తేని జిల్లా వాసి


బాలసుబ్రమణి

పెరంబూర్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేందుకు ఓ దంపతులు అమెరికా నుంచి స్వగ్రామానికి వచ్చారు. తేని జిల్లా చిన్నమనూరు తేరడి వీధికి చెందిన బాలసుబ్రమణి-సుమతి దంపతులకు నాగార్జునన్ అనే కుమారుడున్నాడు. మెక్సికోలో సాఫ్ట్‌వేర్ సంస్థలో పనిచేస్తున్న బాలసుబ్రమణ్యం శుక్రవారం జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు గురువారం స్వగ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అన్నారు. తనతో పాటు విదేశాల్లో పనిచేస్తున్న పలువురు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు వచ్చారని తెలిపారు. ఎన్నికల సంఘం కూడా 100 శాతం పోలింగ్ కోసం అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందీయమని, ప్రజలు కూడా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని బాలసుబ్రమణి విజ్ఞప్తి చేశారు.

జపాన్, అమెరికా నుంచి వచ్చిన తమిళ ఇంజనీర్లు

ప్యారీస్, ఏప్రిల్ 18: జపాన్, అమెరికా దేశాల్లో వృత్తిరీత్యా స్థిరపడిన ఇద్దరు తమిళ ఇంజనీర్లు ఓటు హక్కు వినియోగించుకొనేందుకు స్వదేశానికి తరలివచ్చారు. వీరిలో ఒకరు సేలం కొండాలంపట్టికి చెందిన శంకర్ జపాన్ రాజధాని టోక్యోలో 21 ఏళ్లుగా డిజైన్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. ఆయన జపాన్ దేశ పౌరసత్వం పొందలేదు. ఈ నేపథ్యంలో, శుక్రవారం రాష్ట్రంలో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటేసేందుకు గురువారం ఉదయం చెన్నైకి వచ్చారు. అదే విధంగా అమెరికాలో స్థిరపడిన తంజావూరుకు చెందిన ఇంజనీర్ శివకుమార్ కూడా ఓటు హక్కు వినియోగించుకొనేందుకు నగరానికి విచ్చేశారు.

విలవంగోడు ఉప ఎన్నిక బరిలో పదిమంది అభ్యర్థులు



పెరంబూర్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలతో పాటు విలవంగోడు శాసనసభ ఉప ఎన్నిక కూడా శుక్రవారం జరుగనుంది. గత శాసనసభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీచేసిన విజయతరణి ఆ పార్టీ నుంచి వైదొలిగి బీజేపీలో చేరారు. ఆమె కాంగ్రెస్ పార్టీ సభ్యత్వంతో పాటు ఎమ్మెల్యే పదవికి కూడా రాజీనామా చేయడంతో, లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక కూడా నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఈ స్థానంలో పోటీచేసేందుకు 12 మంది పురుషులు, 10 మంది మహిళలు మొత్తం 22 మంది నామినేషన్లు దాఖలుచేశారు. పరిశీలనలో 12 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, తుది జాబితా ప్రకారం 10 మంది ఎన్నికల బరిలో నిలిచారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తారహై కృత్ బెర్ట్, అన్నాడీఎంకే తరఫున యు.రాణి, బీజేపీ అభ్యర్థిగా వీఎస్ నందిని బరిలో నిలిచారు.

పోలింగ్ కేంద్రంలో 'కమలం' అలంకరణ తొలగింపు

ప్యారీస్, ఏప్రిల్ 18: కేంద్రపాలిత రాష్ట్రం పుదుచ్చేరిలోని ఓ పోలింగ్ కేంద్రంలో 'కమలం' ఆకారంతో ఏర్పాటుచేసిన అలంకరణను డీఎంకే ఫిర్యాదుతో ఎన్నికల అధికారులు తొలగించారు. పుదుచ్చేరిలోని ఒక పార్లమెంటు నియోజకవర్గానికి శుక్రవారం జరుగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్, అన్నాడీఎంకే, బీజేపీ సహా స్వతంత్ర అభ్యర్థులు పోటీచేస్తున్నారు. పుదుచ్చేరిలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు పనులను పూర్తిచేశారు. ఈ నేపథ్యంలో, పుదుచ్చేరి రాష్ట్రంలోని బాగూర్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల ప్రాంగణంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుచేశారు. ప్రవేశద్వారం తామర పుష్పం డిజైన్‌తో అలంకరించడం చర్చనీయాంశమైంది. దీనిపై డీఎంకే, కమ్యూనిస్ట్, కాంగ్రెస్ తదితర పార్టీలు రిటర్నింగ్ అధికారి వద్ద ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు వెంటనే వివాదాస్పదమైన అలంకారాన్ని తొలగించారు.

తొలిసారి ఓటర్లు 10.92 లక్షల మంది

ప్యారీస్, ఏప్రిల్ 18: రాష్ట్రంలోని 39 పార్లమెంట్ నియోకవర్గాల్లో శుక్రవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. రాష్ట్రవ్యాప్తంగా 18-19 ఏళ్ల ఓటర్లు 10.92 లక్షల మంది ఉన్నారు. వీరు తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. తొలిసారి ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికల కోడ్ అమలుకు వచ్చినప్పటి నుంచే అవగాహన ప్రచార కార్యక్రమాలు విరివిరిగా నిర్వహించింది. ఎన్నికల సంఘం వినియోగించిన ఓటరు గుర్తింపుకార్డు సహా ఇతర పత్రాలను చూపించి ఓటు హక్కు వినియోగించుకోవాల్సిందిగా తొలిసారి ఓటర్లకు ఎన్నికల సంఘం సూచించింది.

ఓటేయాలంటే... 25 కిలోమీటర్లు నడవాల్సిందే!


ఇంజియూరువాసులు కొబ్బరి ఆకులతో నిర్మించుకున్న ఇల్లు




కారైయారులో ఓటేయడానికి బయలుదేరిన ఇంజియూరువాసి, కొండదారిని చదును చేస్తున్న వృద్ధుడు

చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తిరునల్వేలి జిల్లా పడమటి కనుమల సమీపంలోని ఇంజికుళి కొండగ్రామంపై నివసిస్తున్న ప్రజలు శుక్రవారం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు 25కి.మీ. వరకు కాలినడకనే పోలింగ్ కేంద్రానికి వెళ్ళనున్నారు. ఇంజికుళి వాసులందరూ వ్యవసాయం, తేనె సేకరించడం, అరటి చెట్ల పెంపకం వంటి వృత్తులు కొనసాగిస్తున్నారు. ఇంజికుళి గ్రామానికి వెళ్లేందుకు ఎలాంటి రహదారి సదుపాయం లేదు. సుమారు నాలుగు కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన కారైయారు డ్యామ్‌ను దాటుకుని వెళితేనే ఇంజికుళి గ్రామాన్ని చేరుకుంటారు. గతంలో ఈ డ్యామ్ దాటి వెళ్లేలా అటవీ శాఖ అధికారులు పడవ సర్వీసులు నడిపేవారు. ప్రస్తుతం ఆ పడవలను సక్రమంగా నడపటం లేదు. దీంతో ఆ గ్రామస్థులు వారానికొకమారు 25 కిలోమీటర్లు కాలినడకనే కారైయారుకు వెళ్ళి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేస్తున్నారు. గతంలో ఇంజియూరులో వంద కుటుంబాలు ఉండేవి. ప్రస్తుతం పది కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. వీరిలో 18 మందికి ఓటుహక్కు ఉంది. వీరందరూ కారైయారు డ్యామ్ దిగువనున్న ఓ పాఠశాలలో శుక్రవారం ఓటు వేయనున్నారు. ఇంజియూరు గ్రామానికి రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు వెళ్ళి ప్రచారం చేయలేదు. ఓట్లడుగలేదు. ఈ నేపథ్యంలో ఆ గ్రామస్థులు రెండు రోజులకు ముందే కారైయారు ప్రాంతంలోని తమ బంధువుల ఇళ్ళకు పయనమయ్యారు. గురువారం రాత్రి కారైయారులోనే 18 మంది బంధువుల ఇళ్లలో బసచేసి శుక్రవారం ఓటేసి తమ స్వస్థలానికి తిరిగి వెళ్లనున్నారు. దశాబ్దాల తరబడి నిత్యావసర వస్తువులు తెచ్చుకోవడానికి, ఓటేసేందుకు 26 కి.మీల దూరం వరకు నడిచి వెళ్లాల్సి ఉంది. తమ గ్రామానికి రోడ్డు వేయమని అధికారులకు ఎన్నోమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆ గ్రామస్థులు వాపోతున్నారు.

వెళ్ళిమలై ఎస్టేట్ వద్ద ఆరుగురి కోసం పోలింగ్ కేంద్రం



చెన్నై, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తేని జిల్లా ఆండిపట్టి తాలూకా మేఘమలై పంచాయతీకి చెందిన వెళ్ళిమలై ఎస్టేట్ ప్రాంతంలో నివసిస్తున్న ఆరుగురు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఆ ఎస్టేట్ ప్రాంతంలో 500 కుటుంబాలు నివసిస్తుండేవి. 1996లో జరిగిన ఎన్నికల్లో ఆ ప్రాంతానికి చెందిన 150 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. వెళ్ళిమలై ప్రాంతంలో పొరుగూళ్ల నుండి కొన్ని కుటుంబాలవారు వచ్చి అక్కడే బసచేసి ఎస్టేట్‌లో పనిచేస్తుండేవారు. కొన్నేళ్ల క్రితం ఎస్టేట్ నడుపుతున్నవారికి విపరీతమైన నష్టాలు రావడంతో ఎస్టేట్ నిర్వహణ బాధ్యతను వేరొకరికి అప్పగించారు. దీంతో అక్కడ ఉండే కార్మికులంతా బయటి ఊళ్లకు వెళ్ళిపోయారు. ప్రస్తుతం అక్కడ రెండు కుటుంబాలు మాత్రమే నివసిస్తున్నాయి. వీరిలో ఇద్దరు మహిళలు, నలుగురు పురుషులు. ఈ ఆరుగురు శుక్రవారం ఓటు వేయడానికి ఓ పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ పోలింగ్ కేంద్రంలో 36 ఓట్లు పోలయ్యాయి. ఆ తర్వాత శాసనసభ ఎన్నికల్లో 12 ఓట్లు పోలయ్యాయి. ప్రస్తుతం ఆరు ఓట్ల కోసం పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. ఆ పోలింగ్ కేంద్రంలో పనిచేయడానికి ఎన్నికల సిబ్బంది కూడా సిద్ధంగా ఉన్నారు. అంతే కాకుండా ఆ పోలింగ్ కేంద్రం వద్ద సాయుధులైన పోలీసులతో భద్రత కూడా కల్పిస్తున్నారు. ఇక పోలింగ్ కేంద్రంగా పనిచేయనున్న పాఠశాల సంగతిని పరిశీలిస్తే ఆ పాఠశాలను ఒకే ఒక విద్యార్థి కోసం నడుపుతున్నారు. ఆ పాఠశాలలో ఓ టీచర్, ఓ హెడ్మాస్టర్ కూడా పనిచేస్తుండటం విశేషం.


కొండ మార్గంలో ఎన్నికల సామగ్రిని తరలిస్తున్న దృశ్యం

కొండ గ్రామానికి పోలింగ్ సామగ్రి తరలింపు

పెరంబూర్, ఏప్రిల్ 18: నామక్కల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని కొండ గ్రామమైన బోదమలైకు ఎన్నికల సామగ్రి సిబ్బంది తలపై మోసుకొని వెళ్లారు. సుమారు 7 కి.మీ కొండ మార్గంలో పోలీసు బందోబస్తు నడుమ గురువారం ఉదయం సామగ్రి తీసుకొని రెవన్యూ సిబ్బంది, ఎన్నికల అధికారులు నడిచి వెళ్లారు. కీళూరు పంచాయతీలో బోదమలై కీళూర్, మేలూరు, కొడమలై అనే మూడు కొండ గ్రామాలున్నాయి. ఈ గ్రామాలకు వెళ్లేందుకు ఇప్పటివరకు రవాణా సౌకర్యం లేదు. ప్రస్తుతం కొండ మార్గంలో రోడ్డు ఏర్పాటుకు రాష్ట్రప్రభుత్వం రూ.140 కోట్లు కేటాయించగా, అందుకు సంబంధించిన పనులు ప్రాథమిక దశలో ఉన్నాయి. ఈ ఎన్నికల్లో కీళూర్ పోలింగ్ కేంద్రంలో 845 ఓట్లు, కొడమై పోలింగ్ కేంద్రంలో 297 ఓట్లున్నాయి. రాశిపురం తహసీల్దార్ కార్యాలయం నుంచి ఉదయం 7 గంటలకు పోలింగ్ సిబ్బంది, పోలీసులు, ఆరోగ్యశాఖ సిబ్బంది మొత్తం 18 మంది విధులు నిర్వహిస్తుండగా, వారు సుమారు 1,200 అడుగుల ఎత్తున్న కొండపైకి నడిచివెళ్లారు.


పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటైన పందిరి, కార్పెట్ - ఓటర్ల కోసం సిద్ధం చేసిన కుర్చీలు

కల్యాణ మండపం కాదు పోలింగ్ కేంద్రం...!

పెరంబూర్, ఏప్రిల్ 18: కల్యాణ మండపాల అలంకరణకు దీటుగా పోలింగ్ కేంద్రాలు రూపుదిద్దుకున్నాయి. రాష్ట్రంలో ఉన్న 39 లోక్‌సభ నియోజకవర్గాలకు శుక్రవారం పోలింగ్ జరుగనుంది. ఈ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్ నమోదయ్యేలా ఎన్నికల సంఘం ప్రజలకు పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో, ఓటర్లను ఆకర్షించేలా పోలింగ్ కేంద్రాలను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతున్నారు. వేలూరు లోక్‌సభ నియోజకవర్గం వాణియంబాడి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 121,122 తదితర పోలింగ్ కేంద్రాలు వాణియంబాడి గాంధీ నగర్‌లోని ప్రభుత్వ కార్పొరేషన్ మోడల్ మహోన్నత పాఠశాలలో ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ పాఠశాల ప్రవేశ ద్వారం నుంచి పోలింగ్ కేంద్రం వరకు పందరి, కార్పెట్, కార్పెట్‌కు ఇరువైపులా పూలకుండీలు ఏర్పాటుచేశారు. అలాగే, క్యూలైన్లలో వేచి ఉండలేని ఓటర్ల కోసం కల్యాణ మండపాల్లో ఉండే కుర్చీలను ఏర్పాటు చేశారు.

జీపే ద్వారా ఓటుకు నోటు

● అన్నామలైపై డీఎంకే ఫిర్యాదు



ప్యారీస్, ఏప్రిల్ 18: జీపే ద్వారా ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్నారంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైపై ఎన్నికల సంఘానికి డీఎంకే ఫిర్యాదు చేసింది. తమిళనాడు-పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఉన్న 40 లోక్‌సభ నియోజకవర్గాలకు శుక్రవారం ఒకే విడతగా ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో, కోవై ఉత్తర జిల్లా డీఎంకే న్యాయవాదుల విభాగం ఆర్గనైజర్ పళనిస్వామి ఎన్నికల నిర్వహణ అధికారికి అన్నామలైపై ఫిర్యాదు చేశారు. కోవై పార్లమెంటు నియోజకవర్గంలో బీజేపీ తరఫున పోటీచేస్తున్న అన్నామలై ఎన్నికల కోడ్ ఉల్లంఘించి ఓటర్లను సెల్‌ఫోన్‌లో సంప్రదించి తనకు ఓటేయాల్సిందిగా జీపే ద్వారా నగదు పంపిణీ చేస్తున్నారని, ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతరం ఆయన ఈ చర్యలకు దిగారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి అన్నామలైపై చట్టపరమైన చర్యలు చేపట్టాలంటూ ఫిర్యాదులో సూచించారు.

దిండుగల్ జిల్లాలో గుర్రాలపై పోలింగ్ సామగ్రి


గుర్రాలపై పోలింగ్ సామగ్రి తరలిస్తున్న దృశ్యం

పెరంబూర్, ఏప్రిల్ 18: దిండుగల్ జిల్లా నత్తం శాసనసభ నియోజకవర్గ పరిధిలో వెల్లకోవి కొండ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు సదుపాయం లేదు. ప్రస్తుతం జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కొండ గ్రామాల్లో మూడు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. ఈ కేంద్రాలకు ఎన్నికల సామగ్రిని అధికారులు గుర్రాల ద్వారా తరలించారు. పోలింగ్ సిబ్బంది, పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది బందోబస్తు నడుమ దట్టమైన అడవి మార్గం గుండా ఎన్నికల సామగ్రిని తరలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం రాత్రి వేళ కావడంతో ఈవీఎంలను అక్కడే భద్రపరచి, మరుసటిరోజు ఉదయం మళ్లీ గుర్రాలపై వాటిని కిందకు తీసుకొచ్చి స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తామని ఎన్నికల అధికారులు తెలిపారు.


ఎత్తయిన కొండలపై వున్న నత్తం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మలైపాక్కం గ్రామానికి ఈవీఎంలను గాడిదలపై తరలిస్తున్న ఎన్నికల అధికారులు


తిరుపత్తూరు దేవాదాయ కమిషర్ కార్యాలయం నుంచి తిరువణ్ణామలై, వేలూరు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను, ప్రత్యేక వీల్‌చైర్ల తరలింపు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ కె.తారక్‌రాజ్

ఇంటి వద్దకే వాహన సౌకర్యం

పెరంబూర్, ఏప్రిల్ 18: లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసేందుకు వృద్ధులు, దివ్యాంగుల ఇంటి నుంచి పోలింగ్ కేంద్రాలకు వెళ్లేలా ప్రత్యేక వాహన సదుపాయం ఏర్పాటుచేసినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. 'సాక్ష్య' అనే యాప్ ద్వారా ఈ ఉచిత వాహన వసతిని పొందవచ్చని, అలాగే 1950 అనే నెంబరును కూడా సంప్రదించవచ్చని ఈసీ తెలియజేసింది. **ఉచిత బస్సు వసతి... :** పోలింగ్ కేంద్రాలకు వెళ్లే వృద్ధులు, దివ్యాంగుల కోసం ఉచిత బస్సు వసతి కల్పించినట్లు రవాణా సంస్థ డైరెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు. ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు చూపించి ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచితంగా ప్రయాణించవచ్చని ఆయన తెలిపారు.

మదురై లో విఘ్నేశ్వరాలయంలో ఎన్నికల అధికారుల పూజలు

● పోలింగ్ కేంద్రాలకు ఈవీఎల తరలింపు

ప్యారీస్, ఏప్రిల్ 18: మదురైలో విఘ్నేశ్వరాలయంలో పూజల అనంతరం ఈవీఎంలను భారీ పోలీసు బందోబస్తు మధ్య అధికారులు పోలింగ్ కేంద్రాలకు తరలించారు. రాష్ట్రంలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ నమోదు ప్రారంభం కానుంది. మదురై పార్లమెంటు నియోజకవర్గంలో మొత్తం 1,160 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఈ కేంద్రాల్లో ఎండ వేడి తగులకుండా ఓటర్ల కోసం షామియానాలు, తాగునీరు తదితర వసతులు సమకూర్చారు. మదురై కార్పొరేషన్ రెండో జోన్ ఎన్నికల అధికారులు ఆ కార్యాలయం సమీపంలో ఉన్న విఘ్నేశ్వరుడి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు ఈవీఎం, వీవీ ప్యాడ్ సహా పోలింగ్ సామగ్రిని పటిష్ఠ పోలీసు బందోబస్తు మధ్య వాహనాల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించారు.

రజినీకాంత్ ప్రశంస ఎన్నటికీ మరిచిపోలేను

● నటుడు వసంత్ రవి



సూపర్‌స్టార్ రజినీకాంత్‌తో కలిసి 'జైలర్' చిత్రంలో నటించే సమయంలో 'మీలాంటి నటుడితో కలిసి నటించడం చాలా గర్వంగా ఉంది' అంటూ ప్రశంసిచారని, అది జీవితంలో ఎన్నటికీ మరిచిపోలేనిది అని హీరో వసంత్ రవి అన్నారు. తన పుట్టిన రోజు వేడుకలను మంగళవారం మీడియా మిత్రులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నేను సినిమాల్లో నటించాలని అనుకున్నపుడు రజినీకాంత్ దగ్గరకు వెళ్ళి ఆయన సలహా తీసుకున్నాను. ఆ తర్వాత ఆయనతోనే 'జైలర్' చిత్రంలో నటించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా తొలి చిత్రం 'తరమణి' నుంచి 'అశ్విన్స్' వరకు మీడియా ఎంతగానో సపోర్టు చేసింది. అందుకే మీడియా మిత్రుల సమక్షంలో పుట్టిన రోజు వేడుకలను జరుపుకుని, వారికి కృతజ్ఞతలు చెబుతున్నాను. తాజాగా తాను నటించిన 'పొన్ ఒండ్రు కండేన్' చిత్రం జియో సినిమాలో విడుదలకానుంది. ఇప్పటివరకు నేను నటించిన చిత్రాలన్నీ సీరియస్ బాణీలోనే కొనసాగాయి. 'జైలర్-2' వస్తుందని అందరూ అంటున్నారు. కానీ, దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ ఈ విషయంపై క్లారిటీ ఇవ్వాలి. 'జైలర్-2' ఎలా ఉండబోతుందో కూడా తెలియదు. కానీ, 'జైలర్ క్లైమాక్స్ మాత్రం రెండో భాగానికి దగ్గరగా ఉంది. 'తరమణి', 'రాకీ', 'అశ్విన్స్' చిత్రాలకు 'ఏ' సర్టిఫికెట్ వచ్చినా ప్రేక్షకులు ఆదరించడం సంతోషంగా ఉంది. 'పొన్ ఒండ్రు కండేన్' చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్‌ను అలరిస్తుంది' అని వివరించారు.

విక్రమ్ బర్త్‌డే స్పెషల్

'తంగలాన్' నుంచి స్పెషల్ టీజర్



చియాన్ విక్రమ్ తన 58వ పుట్టిన రోజు వేడుకలను బుధవారం జరుపుకున్నారు. ఈ బర్త్‌డే స్పెషల్‌గా అతడి కొత్త చిత్రం 'తంగలాన్' నుంచి స్పెషల్ టీజర్‌ను మూవీ మేకర్స్ రిలీజ్ చేశారు. ఇది సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. ఇందులో విక్రమ్ యాక్షన్, స్టంట్ సన్నివేశాలు ప్రతి ఒక్కరినీ మెస్మరైజ్ చేసేలా ఉన్నాయి. పా.రంజిత్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని సంస్థ స్టూడియో గ్రీన్ అధినేత జ్ఞానవేల్ రాజా భారీ బడ్జెట్‌తో నిర్మించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం సమకూర్చారు. కాగా దిగ్గజ దర్శకుడు మణిరత్నం డైరెక్షన్‌లో చియాన్ విక్రమ్, ఐశ్వర్య రాయ్ నటించిన 'రావణన్' చిత్రం మరోమారు రిలీజ్‌కు సిద్ధమైంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న టెక్నాలజీతో ఈ సినిమాకు మరింత మెరుగులద్ది ఈ నెల 17న విడుదల చేశారు. 2010లో విడుదలైన ఈ చిత్రం మంచి ప్రేక్షకాదారణ పొంది, మంచి వసూళ్ళను రాబట్టిన విషయం తెల్సిందే. మద్రాస్ టాకీస్ పతాకంపై నిర్మించిన ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందించారు.

చిత్రజ్యోతి

'సాక్షి'కి వరుస అవకాశాలు!


సాక్షి అగర్వాల్

కోలీవుడ్‌లో యంగ్ హీరోయిన్ సాక్షి అగర్వాల్‌కు వరుస సినిమా అవకాశాలు వరిస్తున్నాయి. ఒక్క తమిళంలోనే కాకుండా, మలయాళం, కన్నడ భాషల్లో కూడా ఆమెకు ఛాన్సులు వస్తున్నాయి. గతంలో రజినీకాంత్ 'కాలా', సుదర్ సి తో 'అరణ్మనై-3', 'నాన్ కడవుల్ ఇల్లై', 'తిరుట్టు వీసీడీ' వంటి అనేక చిత్రాల్లో నటించిన ఆమె... ప్రస్తుతం మలయాళంలో యాక్షన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందుకోసం ఆమె స్వీయ రక్షణ కోసం కరాటే శిక్షణ కూడా తీసుకున్నారు. గ్రామీణ యువతిగా కూడా నటిస్తూ, లంగా వోణీలో దిగిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి చిత్రంలో నటించేందుకు ఆమె ఒప్పందం కుదుర్చుకున్నారు. అలాగే, తమిళంలోనూ పలు చిత్రాల్లో నటించేందుకు కమిట్ అయ్యారు. హీరోయిన్‌గానే కాకుండా, యాక్షన్, విలన్, గ్లామర్, విలేజ్ గర్ల్ ఇలా పలు విభిన్నమైన పాత్రల్లో నటిస్తూ బిజీ నటిగా కెరీర్‌ను కొనసాగిస్తున్నారు.

ఇస్తారా.. చస్తారా!



'పిల్చుకొచ్చేటపుడు ఒక మాట. కూలి డబ్బులిచ్చేటప్పుడు ఇంకొక మాట. ఇదేమి న్యాయం?' అంటూ నిలదీస్తున్న ఆ ఆడవాళ్లను చూసి ఏం జరిగిపోతోందా అని ఆసక్తితో కుప్పం నడి బజారులో గురువారం అందరూ పోగయ్యారు. ఫ్లాష్ బ్యాక్ ఏందంటే.. బుదారంనాడు బులుగు పార్టీవోల్లు కుప్పంలో ర్యాలీ పెట్టుకున్నారు. జనం గనంగా ఉండాలనే రొండు నూర్ల మందిని కూడేసినారు. పార్టీ జెండాలు చేతి కిచ్చి జేజేలు పలికిస్తూ ఊరంతా తిప్పించినారు. ఎఱ్రటి ఎండలో తిరిగీ తిరిగీ ఆ పార్టీ లీడరు ఇంటికి చేరుకునేసరికి సాయంత్రమైపాయె. దుడ్లు ఇస్తే వెళ్లిపోదామని బయట నిలబడ్డారు. లేటయిపోతా ఉండడంతో ఇళ్లలో పనీ పాటా ఉంటుంది గదా.. మా దుడ్లు గూడా మీరే తెచ్చేయ్యండి అని చెప్పి కొందరు ఇళ్లకి వెళ్లిపోయారు. ఆ తర్వాత దుడ్లు తెచ్చి పంచే పని మొదులు పెట్టినారు. తలా ఐదొందలు చేతల్లో పెట్టినారు. అయితే ఉండేవాళ్లకే దుడ్లు అని చెప్పడంతో ఎఱ్రటి ఎండనబడి తిరిగిన ఆడోళ్ల కడుపులు కాలిపాయ. నోళ్లు తెరిచినారు. దాంతో దిగొచ్చి పిల్చుకొచ్చిన వాళ్లందరికీ దుడ్లు లెక్కగట్టి ఇచ్చినారు.

- కుప్పం

ఆ ఇద్దరూ కలిసేకి అయ్యేదేనా!

బెదిరించో, బుజ్జగించో మనుషుల్ని కలపచ్చుకానీ, మనసుల్ని కలపగలరా? గురువారం పలమనేరు వైసీపీ అభ్యరి నామినేషన్ దాఖలు కార్యక్రమంలో జడ్పీ ఛైర్మెన్ శ్రీనివాసులు, నామినేషన్ వేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడల తీరు చూస్తే మాత్రం మనసులు కలిపేది అయ్యేకేనా అనిపించింది. వి.కోట మండలానికే చెందిన ఈ ఇద్దరూ ఒకే సామాజికవర్గం కూడా. ఒకే పార్టీలో రెండు కత్తుల్లా కొనసాగుతూనే ఉన్నారు. ప్రొటోకాల్ రగడలు తారాస్థాయికి చేరడంతో పెద్దిరెడ్డి మధ్యస్తం తప్పలేదు. ఈసారి టికెట్ తనకు ఇవ్వచ్చు కదా అని శ్రీనివాసులు ఆశపడ్డా అధిష్టానం వెంకటేగౌడకే ఇచ్చింది. పార్టీ పెద్దల హెచ్చరికలతో ఇద్దరూ కొంతకాలంగా ఒకే వేదికల మీద కనిపిస్తున్నా ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నారు. గురువారం పలమనేరులో నామినేషన్ దాఖలుకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి సమక్షంలోనూ ఈ ఇద్దరూ ఇలాగే కనిపించారు. దీంతో కష్టమేనప్పా ఇద్దరినీ కలిపేది అని పార్టీవారే చెవులు కొరుక్కున్నారు.

- వి.కోట



ఇదీ మందు



సర్పంచులు.. ఒకప్పట్లో వెలిగారు. ప్రజలకు చేరువలో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తూ, అభివృద్ధి పనులు చేస్తూ, మౌలిక వసతులు కల్పిస్తూ గుర్తింపు పొందారు. అలాంటి సర్పంచులను జగన్ ప్రభుత్వం డమ్మీలుగా మార్చేసింది. నిధులు, విధులు, అధికారాలు లేకుండా చేసింది. ఈ పరిణామం పట్ల అధికార పార్టీ గ్రామ ప్రజాప్రతినిధులూ అసహనంతో ఉన్నారు.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



పంచాయతీ ఖాతాల్లో నిధులు మళ్లించిన ప్రభుత్వంపై కేసు పెట్టాలంటూ ధర్నా చేస్తున్న సర్పంచులు (ఫైల్ ఫొటో)

డమ్మీ.. సర్పంచులు!

స్థానిక సంస్థల్ని నిర్వీర్యం చేసిన జగన్
పంచాయతీల ఖాతాల్లో నిధులు జీరో
ఉమ్మడి జిల్లాలో రూ.195 కోట్ల మళ్లింపు
చిన్న సమస్యనూ పరిష్కరించలేని స్థితిలో గ్రామపాలకులు



మోసం గురూ!

ఉమ్మడి జిల్లాలోని 1411 గ్రామ పంచాయతీలకు కేంద్రం 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్ని విడతల వారీగా రూ.195 కోట్లను జమ చేసింది. జమ చేసిన వెంటనే ఆయా నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేసింది. చాలా మంది సర్పంచులు గౌరవం కోసం అప్పులు చేసి మరీ స్థానిక సమస్యల్ని పరిష్కరించారు. ఖాతాల్లో డబ్బులు లేకపోవడంతో చేసిన పనులకు బిల్లులు రావడం లేదు. దీంతో అప్పులకు వడ్డీలు కట్టుకోలేక సర్పంచులు అల్లాడుతున్నారు. ఇక అప్పు చేసే స్థోమతలేని సర్పంచులు సమస్యల్ని అలాగే వదిలేశారు. చిన్నపాటి సమస్యలనూ పరిష్కరించలేక, ప్రజలకు కనిపించకుండా తిరుగుతున్నారు. తమ నిధుల్ని మళ్లీ పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని సర్పంచులు ఎన్నో ఉద్యమాలు చేశారు. నిధుల్ని దొంగిలించిన సీఎం జగన్ మీద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలంటూ గతేడాది జూలైలో చిత్తూరులో ధర్నా చేసి, పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు. అయినా, ప్రభుత్వం నుంచి చలనం లేదు. దీనికితోడు వలంటీరు, సచివాలయ వ్యవస్థతో సర్పంచుల్ని పట్టించుకునేవారు లేకుండా పోయారు. ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపికలో వీరి ప్రాతినిధ్యం లేకుండా పోయింది. ఈ పరిణామాల పట్ల జగన్ ప్రభుత్వంపై సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారు. వీరిలో ఎక్కువ శాతం అధికార పార్టీకి చెందిన సర్పంచులే ఉన్నారు.

బంగారుపాళ్యం మండలంలోని 170 గొల్లపల్లె పంచాయతీకి మూడేళ్లలో రూ.39 లక్షల ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. ఈ నిధుల్లో నయా పైసా పంచాయతీ అవసరాలకు ఇవ్వకుండా మొత్తం రాష్ట్ర ప్రభుత్వం మళ్లించేసింది. బోర్లు, పైపు లైన్లు, డ్రైనేజీ తదితర పనుల కోసం స్థానిక సర్పంచి ప్రిస్టేజ్ కోసం రూ.14 లక్షలు అప్పు చేసి ఖర్చు చేశారు. ఆ నిధులు ఏళ్లుగా రాకపోవడంతో వడ్డీలు కట్టుకుంటున్నారు.

ఏ ముఖ్యమంత్రీ చేయలేదిలా..

ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ఆర్, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి.. ఇలా ఏ సీఎం కూడా పంచాయతీ కార్యాలయాలకు కరెంటు బిల్లు తీసుకోలేదు. సీఎం జగన్ మాత్రం విద్యుత్తు బకాయిల పేరుతో మా పంచాయతీల నిధుల్ని తీసేసుకున్నారు. ఖజానాలో డబ్బుల్లేకపోవడంతో 14, 15వ ఆర్థిక సంఘం నిధుల్నీ మళ్లించేశారు. దీంతో పంచాయతీల్లో అభివృద్ధి లేకుండా పోయింది. మేము బాధ్యతలు తీసుకుని మూడేళ్లయినా పైసా నిధులు ఇవ్వలేదు.

- భగవతి, ఓటివారిపల్లె సర్పంచి, యాదమరి మండలం





ప్రజలకు న్యాయం చేయలేకపోతున్నా

నా మీద నమ్మకంతో నన్ను గెలిపించిన ప్రజలకు నేను న్యాయం చేయలేకపోతున్నాను. వాటర్ ప్లాంట్ నిర్మించాను, తాగునీటి బోర్లు, పైపు లైన్లు వేశాను. ఇప్పటికే సుమారు రూ.2 లక్షల బిల్లులు రావాలి. కనీసం వీధి లైట్లు వేయాలన్నా ఖాతాల్లో నిధులు లేవు. సొంత డబ్బుల్ని ఖర్చు చేస్తున్నాం.

- ఊహ, నంజరపల్లె సర్పంచి, పెనుమూరు మండలం



జగన్‌ను ఇంటికి పంపేందుకు పనిచేస్తున్నాం



రాష్ట్రంలోని పంచాయతీలకు కేంద్రం ఇచ్చిన రూ.8660 కోట్ల ఆర్థిక సంఘం నిధుల్ని ప్రభుత్వం లాగేసుకుంది. 2023-24 సంవత్సరానికి రెండో విడతగా వచ్చిన రూ.988 కోట్లనూ పంచాయతీల ఖాతాల్లో వేయలేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన రిజిస్ట్రేషన్, మైనింగ్ ఫీజు, ఎంటర్‌టైన్‌మెంట్, ప్రొఫెషనల్ ట్యాక్సునూ జమ చేయలేదు. రాష్ట్రంలోని 12918 మంది సర్పంచులు వైఎస్ జగన్‌ను గద్దె దింపాలని పనిచేస్తున్నాం.


- కోకా ప్రకాష్‌నాయుడు, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు

వడ్డీలు కట్టుకోలేక..

మాకు వచ్చిన ఆర్థిక సంఘం నిధుల్ని ప్రభుత్వం దొడ్డి దారిన మళ్లించేసింది. దీంతో చిన్నపాటి పనులూ చేయలేకపోతున్నాం. తాగునీటి బోర్ల మరమ్మతు, డ్రైనేజీ కాలువల నిర్మాణం, వీధి లైట్ల వంటి చిన్నపాటి పనులకు అప్పులు చేశా. ఇప్పుడు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నా. నన్ను గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నా.

- ఉషశ్రీ, తుంబపాళ్యం సర్పంచి, బంగారుపాళ్యం మండలం

నగరిలో నామినేషన్ వేయాలంటే..!



నగరి అసెంబ్లీ అభ్యర్థులకు ఓ సెంటిమెంటు ఉంది. నామినేషన్ వేసే ముందు వీరంతా పట్టణంలోని కొత్తపేటవద్ద గల అగరవినాయకస్వామి దేవాలయంలో పూజలు చేస్తారు. అక్కడి నుంచి ర్యాలీగా వెళ్లి నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తారు. ఇలా..

● సెంటిమెంట్

గతంలో మాజీమంత్రి చెంగారెడ్డి, దొరస్వామిరాజు, ప్రస్తుతం భానుప్రకాష్, రోజా ఆ సెంటిమెంట్ పాటిస్తున్నారు. అదే క్రమంలో గురువారం టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆలయంలో పూజలు చేసి.. వేదపండితుల ఆశీర్వాదం తీసుకుని.. నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి ర్యాలీగా వెళ్లి నామినేషను వేశారు.

- నగరి

అభ్యర్థులూ.. నోటరీ విషయంలో జాగ్రత్త

ఉమ్మడి జిల్లాలో నామినేషన్ వేసే అభ్యర్థులూ.. నోటరీ అంశంలో జాగ్రత్త. లేదంటే నామినేషన్లు తిరస్కరణకు గురయ్యే ప్రమాదముంది. సాధారణంగా నామినేషన్‌తో పాటు ధ్రువీకృత లైసెన్స్‌డ్ అడ్వకేట్‌తో నోటరీ చేయించాలి. వీరిని గుర్తించడంలో అభ్యర్థులకు స్పష్టమైన అవగాహన అవసరం. ఆదాయ, స్థిర, చరాస్తులు, కేసులు, విద్యార్హతలు తదితర అంశాలను నామినేషన్ ఫారంలో పూరించి 13 డాక్యుమెంట్లతో కలిపి నామినేషన్ పత్రంతో పాటు వివరాలను ధ్రువీకరిస్తూ అఫిడవిట్‌పై నోటరీ సమర్పించాలి. జిల్లాలో చాలామంది అడ్వకేట్ నోటరీలు లైసెన్స్ గడువు ముగిశాక రెన్యువల్ దరఖాస్తు పంపి నోటరీగా కొనసాగుతున్నారు. లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటే రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ అనుమతి ఇస్తుంది. చాలామంది గతంలో నోటరీ లైసెన్స్ పొంది, తర్వాత రెన్యువల్ చేసుకోకుండా కొనసాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఎనిమిది రిజిస్ట్రేషన్ల కార్యాలయాల పరిధిలో ఐదేళ్ల కిందట వంద మందికి పైగా నోటరీలు ఉండగా, తాజాగా 35 మంది మాత్రమే ఉన్నారు. వారి వివరాలను స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ వెబ్‌సైట్‌లో మంగళవారం అందుబాటులో ఉంచారు. వీరి పేర్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ ఎనిమిది మంది రిటర్నింగ్ అధికారులకు పంపారు. ఇన్‌వ్యాలిడ్ నోటరీలతో ధ్రువీకరిస్తే నామినేషన్లు చెల్లుబాటు కావని అభ్యర్థులు గుర్తించాలని అధికారులు సూచిస్తున్నారు.

● నోట్ దిస్ పాయింట్

- చిత్తూరు కలెక్టరేట్

ఫ్యామిలీ క్యాంపెయిన్

చిత్తూరు లోక్‌సభ టీడీపీ కూటమి అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు కుటుంబ సమేతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. గుడిపాల మండలం పసుమందలో దగ్గుమళ్ల సతీమణి సుజాత, తనయుడు రాధే, కుమార్తె రాజీవి, కోడలు ఎస్తేర్ ప్రియాంక, మనవళ్లు రేయాన్స్, రిహాన్స్, మనవరాలు మిషికా మైరా, పార్టీ కార్యకర్తలతో కలసి ఆయన ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. తనను ఎంపీగా గెలిపిస్తే పసుమంద గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు.

- చిత్తూరు సిటీ




● వర్తమానం

ఒకవైపు అభివృద్ధి జరగలేదు. మరోవైపు దాడులు.. పోలీసు కేసులు పెరిగాయి. అందుకే భారీ ఆధిక్యంతో వైసీపీని ఓడించాలన్న కసితో కుప్పం టీడీపీ శ్రేణులు పనిచేస్తున్నాయి. అధినేత నిర్దేశించిన 'లక్ష' లక్ష్యంతో జోష్‌గా ముందుకు సాగుతున్నాయి. అటు వైసీపీ.. గ్రామస్థాయి ప్రజాప్రతినిధుల సహాయ నిరాకరణ, విభేదాల ఉక్కపోతతో సతమతమవుతోంది. కొందరు నేతల క్వారీ, ఇసుక, భూదందాలు, అక్రమాలు శాపాలుగా వెంటాడుతున్నాయి. గ్రామాల్లో రెండు పార్టీలకు లభిస్తున్న ఆదరణ పరంగా ఈ తేడా స్పష్టంగా కనిపిస్తోంది.

- కుప్పం

టీడీపీలో జోష్



- 'లక్ష' మెజారిటీ లక్ష్యంగా విస్తృత ప్రచారం
- విభేదాల ఉక్కపోతలో వైసీపీ
- కుప్పం రాజకీయ ముఖచిత్రం

టీడీపీ సమన్వయకర్త, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇక్కడే ఉంటూ పార్టీ కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నారు. యువతను సమీకరిస్తూ వారికే ప్రధాన బాధ్యతలు అప్పగిస్తూ ప్రచారాన్ని ఉధృతం చేశారు. మరోవైపు చంద్రబాబు క్లాస్‌మేట్, సుదీర్ఘకాలంగా నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా కొనసాగుతున్న పీఎస్ మునిరత్నం గ్రామాల్లో పర్యటిస్తూ.. సీనియర్లందరినీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ప్రచారాన్ని నడిపిస్తున్నారు. ఇంతకాలం అనారోగ్యంతో ఉన్న చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్ కూడా జనాల్లోకి వస్తున్నారు. కాంగ్రెస్‌నుంచి పార్టీలో చేరిన డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు గ్రామస్థాయిలో తనకున్న పరిచయాలతో పార్టీ బలాన్ని పెంచడంలో తనవంతు కృషి చేస్తున్నారు. ఇక, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తన అనుభవంతో పార్టీకి పునర్వైభవం తేవడంలో తనవంతు పాత్ర పోషిస్తున్నారు. ఇక, చంద్రబాబుకు లక్ష మెజారిటీ లక్ష్యంగా విధించుకున్న పార్టీ శ్రేణులు, ఆ దిశగా చురుగ్గా కదులుతున్నాయి. వైసీపీ నవరత్నాల ప్రభావాన్ని సూపర్ సిక్స్ పథకాల ప్రచారంతో దీటుగా ఎదుర్కొంటున్నారు. ఇలా, నాయకులు, కార్యకర్తలు గతంలో చిన్నచిన్న విభేదాలేవైనా ఉంటే పక్కనపెట్టి మరీ ఎన్నికల రంగంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నాయకులు వెంట ఉన్నా లేకున్నా ఎవరికివారు స్వచ్ఛందంగా ప్రచారాలలో పాల్గొంటూ టీడీపీ జెండాను భుజాన వేసుకుని తిరుగుతున్నారు.



అనిమిగానిపల్లెలో టీడీపీ నేతల ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న జనం

పెరుగుతున్న చేరికలు : రోజురోజుకు వైసీపీనుంచి పార్టీలో చేరికలు పెరిగిపోతున్నాయి. గ్రామ స్థాయిలో కుటుంబాలకు కుటుంబాలు టీడీపీలో చేరుతున్నాయి. ఇక, ప్రజల్లోనూ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఐదేళ్ల వైసీపీ పాలనలో నియోజకవర్గంలో వీసమంత అభివృద్ధి కనిపించకపోవడంతోపాటు బలహీనులపై జరిగిన దాడులు, దౌర్జన్యాలు, వైసీపీ నేతల ఇసుక, క్వారీ దందాలతో వారు పూర్తిగా విసిగిపోయారు. దీంతో గ్రామాలలో టీడీపీవైపు మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది.

నామమాత్రంగా కాంగ్రెస్

కాంగ్రెస్‌కు ఎప్పటినుంచో పెద్ద దిక్కుగా ఉన్న డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు, టీడీపీలో చేరిపోయాక అసలే అంతంతమాత్రంగా ఉన్న ఆ పార్టీ పరిస్థితి నియోజకవర్గంలో పూర్తిగా తీసికట్టుగా మారిపోయింది. చిన్నాచితకా నాయకులు కొందరు జిల్లా పదవులకు ఎగబాకినా ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉండిపోయింది. శాంతిపురం మండలానికి చెందిన ఆవుల గోపి అనే వ్యక్తికి టిక్కెట్టు ఇవ్వడంపై పార్టీలో వ్యతిరేకత పెరిగి, కుప్పంలోని పార్టీ కార్యాలయంలో ఫర్నిచర్‌ను శ్రేణులు ధ్వంసం చేసే వరకు వెళ్లింది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రధాన పార్టీలపై ప్రభావం చూపే అవకాశం లేదు.

వైసీపీ: విభేదాలు, అసంతృప్తులు

నామినేషన్ల ప్రక్రియ మొదలైనా వైసీపీలో విభేదాలు తగ్గలేదు. పార్టీ శ్రేణులను కలుపుకొని పోవడంలో భరత్ విఫలమయ్యారు. రెస్కో ఛైర్మన్ సెంథిల్‌కుమార్‌కు, భరత్‌కు పొసగడంలేదన్నది బహిరంగ రహస్యం. ఎన్నికల ప్రచార పర్వంలో ఎవరికివారుగా వ్యవహరిస్తున్నారు. మున్సిపల్ ఛైర్మన్ డాక్టర్ సుధీర్ విధిలేని పరిస్థితుల్లో సఖ్యతగా ఉంటున్నా వీరిద్దరి మధ్యనా సున్నితమైన విభేదాలు ఉన్నాయన్న ప్రచారం ఉండనే ఉంది. ఇక, తన సామాజిక వర్గానికే (వన్నెకుల క్షత్రియ) చెందిన హెచ్.ఎం.మురుగేశ్‌కు పార్టీ మండల కన్వీనర్.. ఆయన కుమార్తె అశ్విని ఎంపీపీ, కోడలు వనిత వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్‌గా పదవులు ఇప్పించారు. ఇలా, ఒకే కుటుంబానికి మూడు పదవులు ఇవ్వడంపై అదే సామాజిక వర్గ నేతల నుంచీ నిరసన వ్యక్తమవుతోంది. ఇక, భూ ఆక్రమణలు, దాడులు, దౌర్జన్యాలకు సంబంధించి మురుగేశ్‌మీద ఆరోపణలున్నా, ఈ కుటుంబాన్నే భరత్ వెనకేసుకొస్తున్నారు. మిగిలిన మూడు మండలాల్లోనూ తన సామాజికవర్గంలోని కొందరు నాయకులనే ప్రోత్సహిస్తూ, మిగిలినవారిని నిరాశపరుస్తున్నారన్న ప్రచారం ఉంది. పైగా ఎమ్మెల్సీగా కుప్పం నియోజకవర్గానికి ఈయన చేసిందేమీ లేదు. స్థానికేతరుడు కావడంతో ఇక్కడి వారితో సంబంధాలు చాలా తక్కువ. పైగా వైసీపీ మార్క్ అయిన భూదందాలు, క్వారీ, ఇసుక దందాలు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకతను తీసుకొచ్చింది.



ప్రభుత్వంపై సర్పంచుల్లో ఆగ్రహం

2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలోని 89 పంచాయతీలలో ఏకంగా 74 వైసీపీ మద్దతుదారులు గెలుచుకున్నారు. ఈ పంచాయతీల్లో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కూడా జరగకపోగా.. నిధులనూ జగన్ ప్రభుత్వం దారి మళ్లించడం.. వలంటీర్ల వ్యవస్థతో తమ అధికారాలను నిర్వీర్యం చేయడం వంటి కారణాలతో అధికార పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు ఆగ్రహంతో ఉన్నారు. వీరంతా పర్వంలో ఎక్కడో తప్ప కనిపించడంలేదు.